

విద్యార్థులకు ల్యాప్‌టాప్‌ల పంపిణీ

బెంగళూరు, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): నగరంలోని నేషనల్ కళాశాల ఇంజనీరింగ్ విద్యార్థులకు ఇండజిన్ కంపెనీ 100 ల్యాప్‌టాప్‌లను ఉచితంగా పంపిణీ చేసింది. బుధవారం ఇండజిన్ కంపెనీ కో-ఫౌండర్ ఆనంద్ కిరణ్, నేషనల్ కళాశాల కమిటీ చైర్మన్ హెచ్ఎన్ సుబ్రహ్మణ్యకు అందజేశారు. ఈ సందర్భంగా ఆనంద్ కిరణ్ మాట్లాడుతూ విద్యార్థులలో నైపుణ్యత అభివృద్ధి చెందాలనే సంస్థ సీఎస్ఆర్ సేవలలో భాగంగా అందజేశామన్నారు. విద్యార్థులు సాంకేతికతను ఉపయోగించుకోవడంతో ముందుండాలన్నారు.

సంబరాల సభ..!

- హాసన్‌లో భారీ సభకు సీఎం కసరత్తు
- 2 లక్షల మందిని సమీకరించే యత్నం
- దేవెగౌడపై పంతం కోసమే



బెంగళూరు, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): ఒకే దెబ్బకు రెండు పిట్టలు అనేలా సీఎం సిద్దరామయ్య వ్యూహాత్మకంగా వ్యవహరిస్తున్నారు. 'ముడా' కేసులో తనపై వచ్చిన ఆరోపణలను తిప్పికొట్టడంతోపాటు ఉప ఎన్నికల్లో జేడీఎస్ పార్టీ ఓటమితో ఖంగు తిన్న తరుణంలోనే బల ప్రదర్శనకు సిద్ధమయ్యారు. మూడు స్థానాలకు జరిగిన ఉప ఎన్నికల్లో చన్నపట్టణలో నిఖిల్ ఓటమి అధికార కాంగ్రెస్‌కు ఎనలేని సంతోషాన్ని కలిగించింది. చన్నపట్టణ ఎన్నిక ఓ విధంగా మాజీ ప్రధాని దేవెగౌడ, సీఎం సిద్దరామయ్యల మధ్య సమరం అనిపించేలా సాగింది. సిద్దరామయ్య ప్రభుత్వం కూలేంతవరకు విశ్రమించేది లేదని దేవెగౌడ శపథం బూని ప్రచారం చేశారు. ఎన్నికల్లో సిద్దరామయ్య కూడా దీటుగానే పర్యటించి సవాళ్లు విసిరారు. దేవెగౌడ ఒక్కలిగలలో ఒకరికి కూడా ఎదగనివ్వలేదన్నారు. తాను బీసీ అనే కారణంతో వ్యతిరేకిస్తారన్నారు. కానీ వైకే రామయ్య, నాగేగౌడ, బచ్చేగౌడ, వరదేగౌడ, పుట్టణ్ణ, చలువరాయస్వామి, బాలకృష్ణ, భైరేగౌడ, కేఆర్ పేట చంద్రశేఖర్ వంటి ఎంతోమందిని ఎదగనివ్వకుండా తొక్కిపెట్టారని ఆరోపించారు. డీకే శివకుమార్, డీకే సురేశ్‌లను ముగించాలని ప్రస్తుతం కంకణం కట్టుకున్నారన్నారు. తాను జీటీ దేవెగౌడకు ముందుగానే హెచ్చరించానని లేదంటే ముగిస్తారని హెచ్చరించానన్నారు. కొడుకులాంటివారని చెప్పుకొంటూనే బీఎల్ శంకర్, వైకే రామయ్యలను ముగించారని ప్రచారం చేశారన్నారు.

ఉప ఎన్నికల ఫలితాలతో జేడీఎస్ పార్టీకి రామనగరలో ఉనికి లేకుండా పోయింది. హాసన్‌లోనూ ఎంపీ సీటు కోల్పోవడంతో భారీ దెబ్బ పడింది. ఇటువంటి తరుణంలోనే దేవెగౌడ కంచుకోటగా ఉండే హాసన్‌లో భారీ సమావేశం నిర్వహించేందుకు సీఎం సిద్దరామయ్య కసరత్తు చేస్తున్నారు. మండ్య, మైసూరులనుంచే కనీసం 2లక్షలమందిని సమీకరించే ఆలోచనలో ఉన్నారు. భారీ సమావేశం ద్వారా సిద్దరామయ్య తన ప్రతిష్ఠను పెంచుకునేందుకు సిద్దమయ్యారు. ఆయనకు ఆప్తులుగా ముద్రపడిన మంత్రులు మహదేవప్ప, రాజణ్ణలను రంగంలోకి దింపారు.



క్రీడామైదానంలేని బీబీఎంపీ పాఠశాల

ఆటకు... టాటా..!



- క్రీడా మైదానాలు లేని పాఠశాలలు
- 3,279 బడుల్లో ఆటలు కరువు
- నగర ప్రాంతాల్లోనే సమస్య తీవ్రం
- నిబంధనలు పాటించని ప్రైవేట్ పాఠశాలలు

బెంగళూరు, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): పాఠశాలల్లో ఆటలు కరువయ్యాయి. క్రీడా మైదానాలులేక పలువురు విద్యార్థులు క్రీడలకు దూరమయ్యారు. బాల్యంలో చదువుతోపాటు క్రీడల్లో పాల్గొనాలని తద్వారా దేహదారుడ్యం, పోటీతత్వంతోపాటు సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమని విద్యాశాఖ దశాబ్దాలకాలంగా ప్రచారం చేస్తోంది. పాఠశాలల్లో ఏటా జరిగే ప్రతి కార్యక్రమంలోనూ విద్యార్థులు, క్రీడల్లో పాల్గొనే అతిథులు, ఉపాధ్యాయులు సూచిస్తుంటారు. వీటన్నింటికంటే ముఖ్యంగా పాఠశాలకు అనుమతి ఇవ్వాలంటే తరగతి గదులకు అవసరమైన మైదానం తప్పనిసరిగా ఉండాలనే నిబంధనలు ఉన్నాయి. అయితే పాటించేవారులేరు. రాష్ట్రవ్యాప్తంగా పిల్లలకు క్రీడా కలాపాలలో ఉత్తేజపరిచేందుకు విద్యాశాఖ ఇంగ్లిష్ ప్రీమియర్‌లీగ్ ప్రైమరీ స్టార్స్ పథకానికి ఒప్పందం చేసుకుంది. స్వయానా విద్యాశాఖ మంత్రి మధు బంగారప్ప క్రీడలను ప్రోత్సహిస్తామని పలు సందర్భాల్లో అభిప్రాయపడ్డారు. పరుగుపందేలు, ఇతరత్రా క్రీడలు తప్పనిసరి చేశారు. అయితే ఆడేందుకు మైదానం, ఆడించేందుకు వ్యాయామ ఉపాధ్యాయులు లేకుండా పోయారు. కొన్ని పాఠశాలలకు పీఈటీలు అందుబాటులో ఉన్నా మైదానాలు లేకపోవడంతో ఉదయం ప్రార్థన, సాయంత్రం బడి వదిలే వేళ క్రమశిక్షణగా విద్యార్థులు బయటకు వెళ్లడం పర్యవేక్షించడం వారి విధిగా మారింది.

మైదానాలు లేని పాఠశాలలు

జిల్లా	పాఠశాలలు	మైదానాలు లేనివి
రామనగర	1275	745 (58శాతం)
రాయచూరు	1603	889 (55.45)
బళ్ళారి	719	383 (53.26)
విజయనగర	1050	553 (52.66)
యాదగిరి	1036	543 (52.41)
బెంగళూరు	1468	767 (52.24)
కోలారు	1887	889 (47.11)

కళాశాల స్థాయిలో

జిల్లా	కళాశాలలు	మైదానాలు లేనివి
కలబురగి	299	207 (69శాతం)
కొప్పళ	117	79 (67.52)
రాయచూరు	193	123 (67.21)
తుమకూరు	283	181 (63.95)
విజయపుర	269	172 (63.94)
మైసూరు	291	172 (59.10)
బెంగళూరు	919	497 (54.50)

క్రీడలకు దూరమవుతున్న విద్యార్థులు

ప్రభుత్వ సమాచారం మేరకు రాష్ట్రంలో 46,755 పాఠశాలలపైకి 16,410 పాఠశాలలకు (35శాతం) మైదానాలు లేవు. 5,877 ప్రభుత్వ కళాశాలలు ఉండగా వీటిలో 3,219 అంటే సుమారు 56శాతం కళాశాలలకు మైదానాలు లేవు. రాష్ట్రంలో లక్షలాది మంది విద్యార్థులు క్రీడలపట్ల ఆసక్తి ఉన్నా సరైన ప్రోత్సాహం, తగిన సౌలభ్యాలు లేకపోవడంతో బాల్యంలో క్రీడలకు దూరమవుతున్నారు. జూనియర్ కళాశాల, డిగ్రీ కళాశాలల్లోనూ మైదానాలు, ఇతరత్రా సౌలభ్యాలు లేక క్రీడా ప్రతిభ బహిరంగమయ్యే పరిస్థితి లేకుండా పోతోంది. ఒకప్పుడు ఏడాదిలో 2-3 క్రికెట్, ఫుట్‌బాల్, హాకీ వంటి టోర్నీలు హోబళి స్థాయిలోనే జరుగుతుండేవి. క్రీడల్లో రాణించడం, గెలుపొందడం అంటే ఒక పెద్ద సవాల్‌గా విజయోత్సవంగా జరుపుకొనేవారు. ఆడేది విద్యార్థులైనా గ్రామ, తాలూకా స్థాయిలో మేం గెలిచామని సాధారణ ప్రజలు కూడా చెప్పుకొనేవారు. రాష్ట్ర విద్యాశాఖ పరిధిలో సగటున 46శాతం పాఠశాలలు, కళాశాలల్లో విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధి వికాసానికి అవసరమైన మైదానాలు లేకుండాపోయాయి.

నిబంధనలు ఏం చెబుతాయంటే..?

పాఠశాలలకు క్రీడామైదానం ఏర్పాటు చేయాలంటే కనీసం 5 ఎకరాల భూమి ఉండాలనే నిబంధనలున్నాయి. నిర్బంధ విద్య (ఆర్టీఈ) చట్టం ప్రకారం విద్యార్థులకు తప్పనిసరిగా సమకూర్చే 8 వ్యవస్థల్లో క్రీడా మైదానం కూడా ఒకటి. చట్టం ప్రకారం తప్పనిసరి చేసినా ప్రభుత్వం పాఠశాలల వారీగా మైదానాలు సమకూర్చేందుకు ఆసక్తి చూపడం లేదనే విమర్శలు ఉన్నాయి. ప్రత్యేకించి నగర ప్రాంతాల్లో ఎక్కువ విద్యాసంస్థల్లో క్రీడామైదానాలు లేవనేది గణాంకాల ద్వారా తెలుస్తోంది. నగర ప్రాంతాల్లో 9వేల పాఠశాలు, 1,500 కళాశాలలకు మైదానాలే లేవు. విద్యానిపుణులు అభిప్రాయం ప్రకారం నగర ప్రాంతాల్లో క్రీడామైదానాలు లేని కారణంగా విద్యార్థులు మొబైల్‌కే పరిమితం అవుతున్నారని, మొబైల్ గేమ్స్‌కు బానిసలుగా మారుతున్నారని, తద్వారా చిన్నారుల్లో అనారోగ్య సమస్యలు పెరుగుతున్నాయని, సమాజంతో కలసి పయనించే విధానం తక్కువ అవుతోందని తల్లిదండ్రులు విచారం వ్యక్తం చేస్తున్నారు. పిల్లల ఆటలకోసం మైదానాలు లేని కారణంగా బాలల హక్కుల ఉల్లంఘనగా పరిగణించాలని శారీరకమైన ధృఢత్వంతో పెంచేందుకు, మానసిక ఉల్లాసానికి క్రీడలు ముఖ్యమని బాలల హక్కుల నిపుణులు అభిప్రాయపడుతున్నారు. ప్రభుత్వ పాఠశాలల పరిస్థితి ఇలా ఉంటే ఇక ప్రైవేట్ విద్యాసంస్థలలో మైదానాలు అనే అంశమే లేకుండా పోయిందనే విమర్శలు వినిపిస్తున్నాయి.



క్యూఆర్ కోడ్ స్కాన్ చేస్తున్న పర్యాటకులు

స్కాన్ చేస్తే సరిగమలు..!

- ఇకపై హంపి శిలల సంగీతం వినడానికి క్యూఆర్ కోడ్

బళ్లారి గాంధీనగర్, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): స్కాన్ చేస్తే శ్రావ్యమైన సంగీతం వినవచ్చు. అత్యాధునిక సాంకేతికతతో పర్యాటకులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. హంపిలోని రాతి శిలల భద్రతా దృష్ట్యా... శిలలను ఎవరూ ముట్టుకోకూడదని ఉద్దేశంతో పర్యాటక శాఖ అధికారులు వినూత్న విధానాన్ని అమల్లోకి తీసుకొచ్చారు. గతంలో హంపిలో రాతి శిలల వేలుతో మీటితే వినబడే సంగీతం... స్మార్ట్‌ఫోన్ ద్వారా క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేస్తే... ఎంచక్కా ఫోన్‌లోనే వింటూ ఆస్వాదించవచ్చు. శిలల భద్రతా దృష్ట్యా 2008 నుంచి సంగీత మంటపంలో స్థంభాలను నిరంతరం పర్యాటకులు తాకడంతో రాతిస్తంభాలు దెబ్బ తిన్న దాఖలాలున్నాయి. దీంతో పర్యాటకులు తాకకుండా ఆంక్షలు విధించారు. ఇప్పుడు అదే స్తంభాలకు క్యూఆర్ కోడ్ ఏర్పాటు చేయడంతో పర్యాటకులు ఆసక్తిగా వీక్షిస్తున్నారు. ఎది స్థంభాలు అడుగు భాగంలో క్యూ ఆర్ కోడ్ ఏర్పాటు చేయడంతో పర్యాటకులకు అందుబాటులో ఉంది. మొత్తం 46 స్థంభాలకు క్యూ ఆర్ కోడ్ ఏర్పాటు చేసే దిశలో పర్యాటక శాఖ అధికారులు కృషి చేస్తున్నట్లు భారత పురావస్తు శాఖ (ఏఎస్ఐ) హంపి సర్కిల్ సూపరింన్‌డెంట్ నిహిల్ దాస్ పేర్కొన్నారు. 25 సెకన్ల నిడివి ఉన్న సంగీతాన్ని వినడానికి క్యూఆర్ కోడ్ చేయాల్సి ఉంటుంది. సంగీతాన్ని ఆలపించే చరిత్ర స్తంభాలకు ఇపుడు డిజిటల్ టచ్ వచ్చిందని అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

మానవ ధర్మం మరువరాదు: సీఎం

బళ్లారి, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): ధర్మాల్లో మానవ ధర్మం గొప్పదని, దానిని ప్రతి ఒక్కరూ తుచ తప్పకుండా పాటించాలని ముఖ్యమంత్రి సిద్దరామయ్య పేర్కొన్నారు. బళ్లారిలో ఆరోగ్యమాత చర్చిలో ధర్మక్షేత్రం అమృత మహోత్సవాల్లో బుధవారం సీఎం పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కులం, మతం పేరుతో ప్రజలను విడదీసే మతోన్మాదులతో జాగ్రత్తగా ఉండాలని కోరారు. విద్యకు క్రైస్తవ మిషన్ పెద్ద పీఠం వేసిందన్నారు. క్రైస్తవ విద్యామిషన్ వల్ల ఈరోజు చాలా ప్రాంతాల్లో విద్యావంతుల సంఖ్య పెరగడానికి క్రైస్తవ మతమే మూలం అన్నారు. మంగళూరు, ఉడిపి లాంటి ప్రాంతాల్లో విద్యావంతుల శాతం పెరగడానికి క్రైస్తవ విద్యామిషనే మూలమన్నారు.
ఏమతమూ ద్వేషాన్ని బోధించదు. ప్రేమ, మానవత్వం అన్ని మతాల సారాంశమన్నారు. మతం యొక్క అర్థం చాలా సులభం, బసవన్న చెప్పినట్టు అందరి పట్ల దయ కలిగి ఉండాలన్నారు. అసూయ ఉన్న చోట భక్తిభావాలు ఉండవన్నారు. ద్వేషంతో సమాజం చీలిపోతోందన్నారు. మన ధర్మం ఆచరించాలి, అన్ని మతాలనూ ప్రేమించాలి అని మన రాజ్యాంగంలో ఉందన్నారు. తాను ఏ మతాన్ని ప్రత్యేకించి ఇష్టపడను. హిందువులూ, క్రైస్తవులు, ముస్లింలు, జైన్లు, బౌద్దులు ఇలా అందరినీ గౌరవిస్తానన్నారు. సమాజంలో ఏ మనిషి అయినా ఎదుగుదలకు చదువు మూలస్తంభం అన్నారు. తాను చిన్నతనంలో గొర్రైలు, పశువులు కాస్తూ నృత్యాలు చేస్తూ ఉండేవాన్ని, అప్పుడు ఉపాధ్యాయుడు తనను బడికి పిలుపించుకుని చదువు చెప్పించారు. అందుకే తాను ఈరోజు ఇంత మనిషిని అయ్యానన్నారు. చదువుకు మించిన మతం మరోది లేదన్నారు. అనంతరం క్రైస్తవ మత గురువు పీటర్ మచాడో. మంత్రి కేజే జార్జ్, డీబీ అధ్యక్షుడు అజయ్ సింగ్, ఎమ్మెల్యేలు నారా భరత్‌రెడ్డి, నాగేంద్ర, తుకారాం అన్నపూర్ణ తదితరులు పాల్గొన్నారు.



ధర్మక్షేత్రం అమృత మహోత్సవాల్లో ప్రసంగిస్తున్న సీఎం సిద్దరామయ్య

ఓడిపోవడం బాధే..!



- అలాగని కుంగిపోయేది లేదు
- మా ఎమ్మెల్యేలు సంతలో సరుకులా..?
- గెలిచామనే అహం మంచిది కాదు
- నిఖిల్ బహిరంగ లేఖ

బెంగళూరు, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): చన్నపట్టణ ఎన్నికల్లో ఓడిపోవడం బాధ కలిగించిందని నాకంటే నా అభిమానులు, కార్యకర్తలు మరింత నిరాశ చెందారని అలాగని కుంగిపోయేది లేదని జేడీఎస్ యువ నాయకుడు నిఖిల్ బహిరంగలేఖ రాశారు. సోషల్‌మీడియాలో లేఖను బుధవారం విడుదల చేశారు. ఎందుకు ఓడిపోయాననేది ఇప్పటికే కారణాలు చెప్పానన్నారు. జేడీఎస్‌లో ఓటమికి భయపడే పరిస్థితి ఉండదన్నారు. గెలుపుకోసం తనతోపాటు ఎంతోమంది శక్తివంచన లేకుండా పనిచేశారన్నారు. 87వేలమంది ఓట్లు వేశారన్నారు. ప్రజాతీర్పును తలవంచి గౌరవిస్తున్నానన్నారు. విచిత్రం ఏమంటే గెలుపొందినవారికి ప్రశాంతతలేదని, వారిముఖంలో సంతోషం లేదన్నారు. ఇంకా ప్రమాణస్వీకారం చేయలేదని, కానీ అప్పుడే రాజ్యాంగ వ్యతిరేక చర్యలకు సిద్ధమై ఓ క్రిమినల్‌లా మాట్లాడుతున్నారన్నారు. మా ఎమ్మెల్యేలను ఖాళీ చేస్తానని సవాల్ చేస్తున్నారని, వారేమైనా సంతలో సరుకులా అన్నారు. ఎన్నికల్లో గెలవచ్చు అంతమాత్రాన అహం పనికిరాదన్నారు. 'సత్యమేవ జయతే'ను నమ్ముతానని ఎన్నికల్లో ఓడానని అంతమాత్రాన కార్యకర్తలకు దూరమయ్యే పరిస్థితి లేదన్నారు. పార్టీ ఇచ్చిన టాస్క్‌లో పాల్గొన్నానన్నారు. కేవలం నామినేషన్లకు రెండు మూడు రోజుల ముందు తనని అభ్యర్థిగా ఖరారు చేశారన్నారు. అయితే నిఖిల్ రాసిన లేఖ సంచలనమైంది. వరుసగా మూడుసార్లు ఎన్నికలలో ఓటమి చెందినా కార్యకర్తలు కుంగిపోరాదనే రీతిలో రాసిన లేఖ స్ఫూర్తిగా నిలిచిందని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

అదుపు తప్పిన బైక్

- కిందపడిన దంపతులు
- బస్సు దూసుకెళ్లి దుర్మరణం

చిక్‌బళ్లాపురం జిల్లా చింతామణి పట్టణంలో బైక్ అదుపు తప్పి దంపతులు కిందపడగా, వెనుకనుంచి వచ్చిన కేఎస్ఆర్టీసీ బస్సు దూసుకెళ్లడంతో వారు అక్కడికక్కడే కన్నుమూశారు.

7

కలబురగి సెంట్రల్ జైలులో మూకుమ్మడిగా ఖైదీల నిరసన

20 చోట్ల లోకాయుక్త దాడులు

బెంగళూరు, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): బెంగళూరుసహా 20 చోట్ల లోకాయుక్త దాడులు జరిపింది. బుధవారం ఇద్దరు అధికారులకు సంబంధించి 20 ప్రాంతాల్లో దాడులు జరిపారు. భారీ స్థాయిలో ఆస్తులను గుర్తించినట్లు తెలుస్తోంది. దేవయ్య పార్కులోని బీబీఎంపీ వెల్ఫేర్ విభాగానికి చెందిన ఓ మహిళా అధికారి లలితా, వయ్యాలికావల్ లే అవుట్‌లోని అకౌంట్స్ విభాగం అధికారి సత్యమూర్తి నివాసాలపై దాడులు చేశారు. వీరితో సంబంధాలు ఉన్నాయనే ఆరోపణలతో కత్రిగుప్పెలోని ఓ పారిశ్రామికవేత్తతోపాటు పలు సహకార సంఘాలపైనా దాడులు చేశారు. లోకాయుక్త డీఎస్పీ సునిల్ వైనాయక్ నేతృత్వంలో కార్యాచరణ సాగింది. తుమకూరులో ఆర్టీఓ కార్యాలయంపై 10మంది లోకాయుక్త అధికారులు దాడులు చేశారు. ఇటీవలే టౌన్ ప్లానింగ్ డైరెక్టర్ తిప్పేస్వామి నివాసంలో భారీగా ఆస్తులను స్వాధీనం చేసుకున్న లోకాయుక్త అప్పటి సమాచారంతోనే దాడులు చేసినట్లు సమాచారం.

కార్పొరేషన్ సొమ్ము కావాల్సినవారి ఖాతాలకు..!

- పశువుల పాక కూడా ఓ కంపెనీనే..!
- రూ.34 కోట్లు బదిలీ



బెంగళూరు, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): వాల్మీకి అభివృద్ధి కార్పొరేషన్ నిధులు మళ్లించిన విధానంకంటే దిగజారేలా బోవి కార్పొరేషన్ నిధులు పక్కదారి పట్టించారు. ఓ పశువులపాకను కంపెనీగా పేరుపెట్టి నగదు బదిలీ చేసిన విషయం సీసీబీ ఏసీపీ అధికారి విచారణలో వెలుగులోకి వచ్చింది. బోవి కార్పొరేషన్‌కు సంబంధించి నిధుల మళ్లింపుపై ఆరోపణలు ఎదుర్కొంటూ జీవా అనే పారిశ్రామికవేత్త ఇటీవల ఆత్మహత్యకు పాల్పడిన తర్వాత పలు విషయాలు వెలుగులోకి వస్తున్నాయి. బోవి కార్పొరేషన్ మాజీ ఎండీ ఆర్ లీలావతి, మాజీ జనరల్ మేనేజర్ నాగరాజప్ప, అధికారి సుబ్బప్ప కింగ్ పిన్‌లుగా వ్యవహరించినట్లు సీసీబీ గుర్తించింది. నాగరాజప్ప పీఏ, ఆమె సోదరుడితోపాటు వారి ఇంట్లో బాడుగకు ఉండే వ్యక్తుల పేరిట నకిలీ కంపెనీలు సృష్టించారు. బ్యాంకు ఖాతాలకు కోట్లాదిరూపాయలు బదిలీ చేసినట్లు సీసీబీ ప్రాథమిక విచారణలో గుర్తించింది. రూ.90కోట్ల దాకా నగదు బదిలీ చేసినట్లు గుర్తించారు. బోవి సామాజికవర్గం సమగ్ర అభివృద్ధి కోసం 2016 ఫిబ్రవరిలో బోవి అభివృద్ధి కార్పొరేషన్‌ను ప్రారంభించి ఏటా నిధులు కేటాయిస్తున్నారు. ఇటీవల ఆత్మహత్యకు పాల్పడిన జీవా, ఆమె సోదరి సంగీతలు బనశంకరిలో మాజీ జనరల్ మేనేజర్ నాగరాజప్ప ఇంట్లో అద్దెకు ఉండేవారు. నాగరాజప్ప పేరిట నకిలీ కంపెనీ ప్రారంభించిన విషయం వెలుగులోకి వచ్చింది. కంపెనీని గుర్తించేందుకు అధికారులు సోదాలు జరపగా అక్కడ ఓ పశువుల పాక ఉన్నట్లు గుర్తించారు. జీవా పేరిట అనికా ఎంటర్‌ప్రైజెస్ సంస్థను ప్రారంభించి కోటక్ మహీంద్ర బ్యాంకులో ఖాతా తెరిచారు. సదరు ఖాతాకు 1.76 కోట్ల రూపాయలు బదిలీ చేశారు. జీవా చెల్లెలు సంగీత పేరిట హర్నిత క్రియేషన్స్ కంపెనీని ప్రారంభించి కెనరాబ్యాంకులో ఖాతా తెరిచి రూ.3.79 కోట్లు బదిలీ చేశారు. 2021-22, 2022-23 ఆర్థిక సంవత్సరంలో 56.55 కోట్ల రూపాయలు దుర్వినియోగం చేసినట్లు తెలుస్తోంది. నాగరాజప్ప పీఏగా కాంట్రాక్టు పద్ధతిన పనిచేసిన యశస్విని పేరిట న్యూడ్రీమ్స్ ఎంటర్‌ప్రైజెస్ సంస్థ పేరుతో ఖాతా తెరచి రూ.8.78 కోట్లు, ఆమె సోదరుడు కార్తీక్‌గౌడ పేరిట ఆదిత్య ఎంటర్‌ప్రైజెస్ పేరిట రూ.4.76 కోట్లు జమ చేశారు. సంతోష్ పేరిట సోమనాథ్ ఎంటర్‌ప్రైజెస్ స్థాపించి రూ.9.66 కోట్లు, కాంతు ఒడియార్, సుప్రితా కాంతుల పేరిట కంపెనీలు తెరిచి రూ.11.40 లక్షలు బదిలీ చేసినట్లు సీఐడీ గుర్తించింది. మాజీ ఎండీ లీలావతి, తన సోదరి మంగళారామ్‌ల పేరిట రూ.1.48 కోట్లు బదిలీ చేసి ఆ తర్వాత విడతలవారీగా నగదు డ్రా చేసినట్లు గుర్తించామని నగర పోలీస్ కమిషనర్ దయానంద్ ప్రకటించారు. మరిన్ని కోణాలలో దర్యాప్తు సాగుతోందన్నారు.




బోవి కార్పొరేషన్ కార్యాలయం

విధానసౌధలో 167వ ఎస్ఎల్‌బీసీ సభ

బెంగళూరు, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): స్టేట్‌లెవెల్ బ్యాంకర్స్ కమిటీ (ఎస్ఎల్‌బీసీ) 167వ సమావేశాన్ని లీడ్‌బ్యాంకు కెనరాబ్యాంకు ఆధ్వర్యంలో విధానసౌధలో బుధవారం జరిగింది. రాష్ట్ర ప్రభుత్వ డెవలెప్‌మెంట్ కమిషనర్, అదనపు ముఖ్యకార్యదర్శి ఉమామహదేవన్ అధ్యక్షత వహించగా కెనరాబ్యాంకు ఈడీ హరదీప్‌సింగ్ అహ్లువాలియా పర్యవేక్షణలో సభ జరిగింది. రాష్ట్ర ఆర్థికశాఖ కార్యదర్శి డాక్టర్ విశాల్, ఆర్‌బీఐ రీజనల్ డైరెక్టర్ సోనాలిసేన్ గుప్త, నబార్డు చీఫ్ జనరల్ మేనేజర్ కేవీఎస్ఎస్ఎల్‌వీ ప్రసాద్‌రావు, ఎస్ఎల్‌బీసీ సంచాలకులు కేజే శ్రీకాంత్‌తోపాటు రాష్ట్రంలోని అన్ని బ్యాంకుల ముఖ్యులు భాగస్వామ్యులయ్యారు. అధ్యక్షత వహించిన ఉమామహదేవన్ మాట్లాడుతూ ప్రధానమంత్రి జీవన జ్యోతి, ప్రధానమంత్రి జీవన సురక్షా పథకాలకు అర్హులైనవారందరినీ బ్యాంకులు చేర్చేందుకు ప్రయత్నించాలన్నారు. రెండో త్రైమాసికంలో 79.97శాతం సీడీ రేషియో సాధనపై బ్యాంకర్లను ప్రశంసించారు. సెప్టెంబరు త్రైమాసికంలో ఏసీపీ సాధన విజయవంతమైందని, ఆర్థిక సంవత్సరం లక్ష్యంతో వ్యవసాయ రంగంలో 54శాతం అభివృద్ధి జరిగిందన్నారు. ఎంఎస్ఎంఇలో 62శాతం, ప్రాధాన్యతా రంగాలలో 57శాతం ప్రగతిపై బ్యాంకర్లను అభినందించారు. మహిళా సంఘాలకు వ్యాపార అభివృద్ధికోసం రుణాలు పెంచాలని సూచించారు.



సమావేశంలో అదనపు ముఖ్యకార్యదర్శి ఉమామహదేవన్, కెనరా బ్యాంకు ఈడీ హరదీప్‌సింగ్ అహ్లువాలియా



తుంగభద్ర నీటి మట్టం : 1633 అడుగులు

	ప్రస్తుతం	గత ఏడాది
నీటి మట్టం (అడుగులు)	1630.15	1594.66
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	3,302	508
ఔట్ ఫ్లో (క్యూసెక్కులు)	6,984	8,542
నీటి నిల్వ (టీఎంసీలు)	94.63	15.36

నకిలీ బిల్లు.. ఖజానాకు చిల్లు..!

● బళ్లారి కార్పొరేషన్ సిబ్బంది చేతివాటం ● డూప్లికేట్ బిల్లులతో పన్ను వసూలు ● ఉద్యోగులకు కమిషనర్ నోటీసులు



బళ్లారి కార్పొరేషన్ కార్యాలయం

బళ్లారి గాంధీనగర్, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): బళ్లారి నగరం రోజు రోజుకూ అభివృద్ధి చెందుతూ విశాలంగా విస్తరిస్తోంది. లేఔట్లు, అపార్ట్‌మెంట్లు, బహుళ అంతస్థుల భవనాలు ఇలా పెరుగుతూనే ఉన్నాయి. అయితే కార్పొరేషన్‌కు మాత్రం అనుకున్న స్థాయిలో పన్నులు వసూలు కావడం లేదు. కార్పొరేషన్ పరిధిలో 39 డివిజన్‌లు ఉండగా, ప్రజల సౌకర్యార్థం కార్పొరేషన్ పాలన సరళీకృతంలో భాగంగా మూడు డివిజన్‌లుగా విభించారు. ఇందులో గాంధీనగర్ మొదటి డివిజన్ కాగా, ప్రస్తుతం కార్పొరేషన్ చుట్టు ప్రక్కల ప్రాంతాన్ని డివిజన్ -2 గాను, కౌల్ బజార్ ప్రాంతాన్ని డివిజన్ -3గా విభజిస్తూ ఆయా డివిజన్‌లకు అసిస్టెంట్ కమిషనర్లను నియమించారు. ఆయా డివిజన్ పరిధిలోకి వచ్చే వార్డు ప్రజలు రాయల్ సర్కిల్‌కు రాకుండా వెసులబాటు కల్పిస్తూ ఆయా డివిజన్‌లోనే ఇంటి పన్ను, నీటి పన్ను, యూజీడీ పన్నులు చెల్లించేందుకు అవకాశం కల్పించారు. ఈ అవకాశాన్ని కొంతమంది కార్పొరేషన్ సిబ్బందితో చేతులు కలిపి ప్రైవేట్ వ్యక్తులు ట్యాక్సులు వసూలు చేస్తూ నకిలీ బిల్లులు సృష్టించి ప్రజలను మోసం చేస్తున్నట్లు తెలుస్తోంది. కొంతమంది బడాబాబులు ఇదే అదనుగా భావించి ప్రైవేట్ వ్యక్తులను ఆశ్రయించి లక్షల్లో చెల్లించాల్సిన పన్నులను వేలల్లోకి మార్చుకుని కార్పొరేషన్ ఖజానాకు గండి కొడుతున్నట్లు తెలుస్తోంది. కొందరు కార్పొరేషన్ సిబ్బంది కూడా వీరికి అండగా నిలిచినట్లు తెలుస్తోంది. ఇటీవలే అనంతపురం రోడ్డులో ఓ బడాబాబులకు చెందిన అపార్ట్‌మెంట్... రాధికా థియేటర్ వద్ద ఉన్న ఓ లాడ్జ్‌కు సంబంధించి ప్రాపర్టీ ట్యాక్స్ చెల్లించే విషయంలో కార్పొరేషన్ సిబ్బంది అవకతవకలకు పాల్పడినట్లు కమిషనర్ దృష్టికి వచ్చింది. లభించిన నకిలీ ట్యాక్స్ బిల్లుల ఆధారంగా పరిశీలించిన సమయంలో బిల్లుల్లో ఉన్న మొత్తం.. కార్పొరేషన్ ఖజానాకు జమ కాలేదన్న విషయం వెల్లడయ్యింది.

సిబ్బందికి నోటీసులు జారీ : కమిషనర్

పన్నుల వసూళ్లలో అవకతవకలపై కార్పొరేషన్ కమిషనర్ ఖలీల్ సాబ్‌ను వివరణ కోరితే... నగరంలో ఇద్దరు వ్యక్తుల నుంచి ఫిర్యాదులు అందాయన్నారు. ప్రాపర్టీ ట్యాంకుల రూపంలో ఇంటి యజమానులు ఇచ్చిన మొత్తం.... కార్పొరేషన్‌లో లెక్కల్లో తేడా రావడంతో బిల్‌కలెక్టర్, అసిస్టెంట్ బిల్‌కలెక్టర్, రెవెన్యూ ఇన్స్‌పెక్టర్‌కు నోటీసులు జారీ చేసినట్లు తెలిపారు. వారి నుంచి వివరణ అందుకున్న తరువాత విషయం తెలుపుతానని దాటవేశారు. మేయర్ వచ్చిన తర్వాత మరిన్ని వివరాలు చెప్తాననడం విడ్డూరం. సిబ్బంది తప్పు చేశారన్న విషయం తెలిసినా... చర్యలు తీసుకోక పోవడంపై పాలక మండలి చేతిలో కమిషనర్ కీలు బొమ్మగా మారారని విమర్శలు వినిపిస్తున్నాయి.

వరికి మద్దతు ధర కల్పించాలి : రైతు సంఘం



మాట్లాడుతున్న రైతుసంఘం అధ్యక్షుడు గోవింద్

బళ్లారి సిటీ, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): వరికి మద్దతు ధర కల్పించాలని డిసెంబరు 2న నగరంలో భారీ నిరసన ర్యాలీ నిర్వహిస్తున్నట్లు ఏకేకేఎంఎస్ జిల్లా అధ్యక్షులు గోవింద్ తెలిపారు. బుధవారం నగరంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ వరికి క్వింటాల్‌కు రూ.3,500 మద్దతు ధర నిర్ణయించాలని, డిసెంబరు మొదటి వారం నుంచి కొనుగోలు కేంద్రం ద్వారా వరి కొనుగోలు ప్రారంభించాలని డిమాండ్ చేశారు. అందరికీ అన్నం పెట్టే రైతు పరిస్థితి ఇప్పుడు దారుణంగా మారిందన్నారు. బడా వ్యాపారులకు రూ.కోట్లు మాఫీ చేసే ప్రభుత్వాలు రైతుల దుస్థితిపై నిర్లక్ష్యం వహిస్తున్నాయన్నారు. నిరసన ర్యాలీని రైతులు జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.వరి ధాన్యాన్ని నిల్వ చేసేందుకు ఉచిత గోదాము వసతి కల్పించాలని డిమాండ్ చేశారు. ఈసందర్భంగా రాష్ట్ర కమిటీసభ్యులు హనుమంతప్ప, జిల్లా కార్యదర్శి గురల్లి రాజా పాల్గొన్నారు.

చిరుత దాడిలో ఆవు మృతి

కంప్లి, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : చిరుత దాడిలో ఆవు మృతి చెందింది. విజయనగర జిల్లా హోస్పేట తాలుకా పరిధిలోని నాగనహళ్లి వద్ద వుండే బెళకాపురం వద్ద ఆవుల మందపై చిరుత దాడి చేయడంతో ఆవు దూడ మృతి చెందింది. కాపరులు మేత కోసం అడవులకు వెళ్లగా పొదల్లో వున్న చిరుత ఒక్కసారిగా దూడపై దాడి చేసి హతమార్చింది. వెంటనే అక్కడున్న కాపరులు కేకలు వేయడంతో చిరుత పరుగులు తీసింది. విషయాన్ని ఆవుదూడకు చెందిన రైతుకు, ఫారెస్టు అధికారులకు తెలియజేశారు. అధికారులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ పశువుల కాపర్లు అప్రమత్తంగా ఉండాలని, వెంటనే బోనులు ఏర్పాటు చేసి చిరుతను బంధిస్తామన్నారు.

గడ్డివాములు దగ్ధం



మంటలు ఆర్పుతున్న సిబ్బంది

కంప్లి, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : గడ్డివాములు దగ్ధం కావడంతో రూ.లక్షల నష్టం వాటిల్లింది. బుధవారం సిరుగుప్ప తాలుకా పరిధిలోని హళేకోట 2వ వార్డులో పాతప్ప పొలంలో వేసిన తొమ్మిది గడ్డివాములు మంటలు ఏర్పడి దగ్ధమయ్యాయి. మధ్యాహ్న సమయంలో గుర్తుతెలియని వ్యక్తులు మంటలు పెట్టి ఉండవచ్చునని స్థానికులు తెలిపారు. అగ్నిమాపకదళ అధికారులు మంటలు ఆర్పడానికి ప్రయత్నం చేసి విఫలమయ్యారు. రూ. 4 లక్షలకు పైగా నష్టం వాటిల్లిందని రైతు వాపోయారు. నష్టపోయిన రైతులకు ఆదుకోవాలని రైతు సంఘం నాయకులు కోరారు. ఈ సంఘటనపై కూడా కేసు నమోదైనట్లు అగ్నిమాపకదళ అధికారి నాజిర్ హుస్సేన్ తెలిపారు.

కనీస వేతనం చెల్లించాలని నిరసన



నిరసనలో పంచాయతీ కమ్యూనిటీ రిసోర్స్ పర్సన్లు

బళ్లారి సిటీ,నవంబరు 28(ఆంధ్రజ్యోతి): ఎనిమిదేళ్లుగా పనిచేస్తున్న తమకు కనీస వేతనాలు ఇవ్వాలని గ్రామపంచాయతీ స్థాయి స్థానిక కమ్యూనిటీ రిసోర్స్ పర్సన్లు బుధవారం డీసీ కార్యాలయ ఆవరణలో నిరసన వ్యక్తం చేశారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని జిల్లాపంచాయితీ సీఈఓకు అందజేశారు. ఈసందర్భంగా శ్రీధరగడ్డకు చెందిన యశోద, అమరాపురానికి చెందిన సుజాత మాట్లాడుతూ గ్రామపంచాయితీ స్థాయిలో ఏర్పాటైన సంజీవిని మహిళా సంఘం కార్యకర్తలకు కేంద్ర ప్రభుత్వం పశు సంవర్ధక శాఖకు రూ.2500, వ్యవసాయ శాఖకు రూ.3000 గౌరవ వేతనం అందజేస్తోందన్నారు. ఇది కూడా ఆరు నెలలకోసారి ఇస్తున్నారని, యూనియన్ అధికారుల సంతకాలు తప్పనిసరి చేయడం సరి కాదన్నారు. స్థానిక కమ్యూనిటీ రిసోర్స్ పర్సన్‌గా నేరుగా మన ఖాతాలో జమ చేయాలని, పనికి తగిన వేతనం ఇవ్వాలని వారు డిమాండ్ చేశారు. నిరసనలో గ్రామపంచాయితీ స్థానిక కమ్యూనిటీ రిసోర్స్ పర్సన్లు తదితరులు పాల్గొన్నారు.

రైతు సంఘాల ఆధ్వర్యంలో ధర్నా

బళ్లారిరూరల్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : మిర్చి ధరకు గిట్టుబాట ధర కల్పించాలని రైతులు ఆందోళన చేపట్టారు. బుధవారం నగరంలోని కలెక్టర్ కార్యాలయం సమీపంలో రైతు సంఘాల నాయకులు ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా రాష్ట్ర రైతు సంఘం అధ్యక్షుడు మాధవరెడ్డి మాట్లాడుతూ వేల రూపాయల పెట్టుబడులు పెట్టి పండించిన పంటకు గిట్టుబాటు ధర కల్పించకపోవడం అన్యాయమన్నారు. 2023వ సంవత్సరంలో రైతుల విద్యుత్ బకాయిలు రద్దు చేయాలని, దళారీల నుంచి రైతులను కాపాడాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయుసీ జిల్లా ఉపాధ్యక్షుడు సోమశేఖర్‌గౌడ, జిల్లా అధ్యక్షుడు ఆదిమూర్తి శివశంకర్, గోవిందు పలు రైతు సంఘం ప్రధాన అధికారులు తదితరులు పాల్గొన్నారు.



కలెక్టర్ కార్యాలయం ముందు ఆందోళనలో రైతుసంఘం నాయకులు

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించండి



వినతిపత్రం అందిస్తున్న ఉపాధ్యాయ సంఘం అధ్యక్షుడు శ్రీధర

సిరుగుప్ప, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని, అరటి పండు, గుడ్లు, శనగల పంపిణీకు ప్రత్యేక ఏజెన్సీ ఏర్పాటు చేయాలని ప్రాథమిక ఉపాధ్యాయుల సంఘం అధ్యక్షుడు శ్రీధర ప్రభుత్వాన్ని కోరారు. బుధవారం సిరుగుప్ప పట్టణంలో మధ్యాహ్న భోజన పథకానికి సంబంధించి ఆహార పరికరాల పంపిణీపై ఉపాధ్యాయులకు అప్పగించడం వలన తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు వాపోయారు. ఆహార పరికరాల పంపిణీకు ప్రత్యేక ఏజెన్సీ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ప్రతి ఒక పంపిణీను ల్యాప్‌టాప్‌లో పంపించేందుకు ఉపాధ్యాయులు ఇబ్బందులు పడుతున్నట్లు తెలిపారు. తక్షణం ప్రభుత్వం సమస్యను పరిష్కరించాలని కోరారు. ఈ సందర్భంగా పంచాయతీ ఈవో పవన్‌కుమార్‌కు మనవిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయ సంఘం ప్రధాన కార్యదర్శి హనుమనగౌడ, గౌరవాధ్యక్షులు సూర్యకాంతరెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌ను వీడేది లేదు : ఎమ్మెల్యే గవియప్ప



కంప్లి, నవంబరు 27(ఆంధ్రజ్యోతి) : ఎట్టి పరిస్థితుల్లో కాంగ్రెస్‌ను వీడేది లేదని ఎమ్మెల్యే గవియప్ప అన్నారు. బుధవారం విలేకరులతో మాట్లాడిన ఆయన గ్యారెంటీ పథకాల వల్ల అభివృద్ధి కుంటుపడుతుందని అన్నానని, పార్టీపై ఎలాంటి విరోధం లేదన్నారు. తనకు జీవితాన్నిచ్చింది కాంగ్రెస్ పార్టీనేనన్నారు. ఇటీవల ఆయన వ్యాఖ్యలపై డీసీఎం డీకే ఆగ్రహం వ్యక్తం చేసిన సంగతి తెలిసిందే.

దేవదాసీల సమస్యలు పరిష్కరించాలి

సిరుగుప్ప, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : దేవదాసీలకు ఐదు ఎకరాలు భూమిని కేటాయించాలని దేవదాసీల సంఘం అధ్యక్షురాలు ఈరమ్మ ప్రభుత్వానికి డిమాండ్ చేశారు. బుధవారం సిరుగుప్ప పట్టణంలో దేవదాసీలు తమ సమస్యల పరిష్కారం కోసం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేవదాసీలకు పెండింగ్ వున్న పింఛన్లను తక్షణమే మంజూరు చేయాలన్నారు. దేవదాసీల పిల్లలకు ప్రోత్సాహక ధనం అందజేయాలని, వివాహాలకు రూ. ఐదు లక్షలు ప్రోత్సాహక ధనం ఇవ్వాలని కోరారు. సమస్యలు పరిష్కరించపోతే ఉద్యమిస్తామని హెచ్చరించారు. వీరి పోరాటానికి సీపీఐ నాయకులు మద్దతు పలికారు.

చికిత్స పొందుతూ బాలింత మృతి

బళ్లారి సిటీ,నవంబరు 27(ఆంధ్రజ్యోతి): బళ్లారి జిల్లాసుపత్రిలో వరుస మరణాల సంఘటన మరవకముందే నగరంలోని బిమ్స్ ఆసుపత్రిలో మరో బాలింత మృతి చెందింది. వైద్యుల నిర్లక్ష్యంతోనే బాలింత మృతి చెందిందని బంధువులు ఆరోపిస్తున్నారు. విజయనగరం జిల్లా కూడ్లిగి తాలూకాలోని హలసాగర్ గ్రామానికి చెందిన మహాలక్ష్మీ ఆదివారం సాధారణ ప్రసవంలో మగబిడ్డకు జన్మనిచ్చింది. ప్రసవం తర్వాత ఆమె ఆరోగ్యం కుదట పడక డాక్టర్లు ఐసీయూలో ఉంచి మూడు రోజులపాటు చికిత్స అందించారు. చికిత్స ఫలించక కన్ను మూసింది. వైద్యుల నిర్లక్ష్యంతోనే మహాలక్ష్మీ మృతి చెందిందని భర్త మారేశ్ ఆరోపించారు. రక్త హీనతతో పీహెచ్‌సీకి తరలించేలోపే మృతి చెందిందని, చికిత్స లోపం లేదని బిమ్స్ డైరెక్టర్ గంగాధర్ గౌడ స్పష్టం చేశారు.



మహాలక్ష్మీ (ఫైల్)

ప్రభుత్వాలు విఫలం : సీపీఐఎం

కంప్లి, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు రైతులను, కూలీ కార్మికులను ఆదుకోవడంలో విఫలమయ్యాయని సీపీఐఎం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బసవరాజు ఆగ్రహం వ్యక్తం చేశారు. విజయనగర జిల్లాలో సీపీఐఎం 13వ సమ్మేళన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో పేదలకు, కూలీలకు సరిగా పథకాలు అందడం లేదని, నాయకులు ప్రజల కష్టాలను పట్టించుకోవడం లేదన్నారు.



సమ్మేళనంలో మాట్లాడుతున్న బసవరాజు

కంకర తేలిన అంజనాద్రి రోడ్డు



కంకర తేలిన అంజనాద్రి రహదారి

గంగావతి రూరల్, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): హనుమంతుడు జన్మించిన అంజనాద్రికి వెళ్లే రహదారి దుస్థితిపై భక్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అంజనాద్రి చేరుకోవాలంటే గంగావతి పట్టణం మీదుగానే వెళ్ళాల్సి ఉంటుంది. అంజినాద్రి బెట్టను చూసేందుకు ఇటీవల పర్యాటకులు విరివిగా వస్తున్నారు. అయితే రహదారి కంకర తేలి వాహనదారులకు తీవ్ర ఇబ్బందిగా మారింది. గతంలో ఈ దారిని సుందరంగా మారుస్తామని చెప్పిన నేతల మాటలు హామీలుగానే మిగిలిపోయాయి. గంగావతి పట్టణంలోని గాంధీ సర్కిల్, బసవణ్ణ సర్కిల్, జులై నగర్, శివటాకీసు, బిలాల్ మసీదు రోడ్డు, బస్‌స్టేషన్, విరుపాపుర తాండా, లలితమహల్ హోటల్‌లతో చేరి అనేక చోట్ల గుంతలమయమైన రోడ్లు దర్శనం ఇస్తాయి. స్థానిక ఎమ్మెల్యే గాలి జనార్దన్ రెడ్డి ప్రజల సమస్యలు గాలికొదిశారని విమర్శలు వినిపిస్తున్నారు. కేకేఆర్‌డీబీ నిధుల క్రింద సాయినగర్ నుంచి కడేబాగిలు క్రాస్ వరకు రూ.22కోట్లతో నిర్మించాల్సిన రోడ్డు పనులు ఇంకా ప్రారంభం కాలేదని, అధికారులు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

రక్తదాన శిబిరం

బళ్లారిరూరల్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : తాలుకాలోని మోకా సముదాయ ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో మోకా హాస్పిటల్ డాక్టర్ భారతి, కర్నాటక రక్షణ వేదిక గ్రామీణ అధ్యక్షులు పంపనగౌడ నేతృత్వంలో రక్తదాన శిబిరం బుధవారం నిర్వహించారు. శిబిరంలో గ్రామంలోని యువకులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో పంపనగౌడ మాట్లాడుతూ రక్తదానం తో ప్రాణాలు కాపాడవ్చన్నారు. హాస్పిటల్ సిబ్బంది ఆశా కార్యకర్తలు కరవే పదాధికారులు పాల్గొన్నారు.

వరి కొనుగోలు ప్రారంభించే వరకు పోరాటం..



శిబిరంలోనే నిద్రిస్తున్న మాజీ ఎమ్మెల్యే సోమలింగప్ప

సిరుగుప్ప, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : వరిధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించేంత వరకు పోరాటం కొనసాగుతూనే వుంటుందని మాజీ ఎమ్మెల్యే సోమలింగప్ప అధికారులపై విరుచుకుపడ్డారు. బుధవారం సిరుగుప్ప పట్టణంలో వరిధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించాలని, వర్షాలకు దెబ్బతిన్న పంటలకు నష్టపరిహారం కల్పించాలని నిరసిస్తూ బీజేపీ పార్టీ ఆధ్వర్యంలో రెండో రోజు నిరాహారదీక్ష చేపట్టారు. రాత్రంతా శిబిరంలోనే ఆయన నిద్రించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం రైతు సమస్యలపై నిర్లక్ష్యం వహిస్తోందని, ఆత్మహత్యలు చేసుకుంటున్నా పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. కొనుగోలు కేంద్రాలు ప్రారంభించాలని, గిట్టుబాటు ధర కల్పించి రైతులను ఆదుకోవాలన్నారు. ఎమ్మెల్యే తాలుకా అభివృద్ధి పై దృష్టి సారించకపోవడం సిగ్గుచేటన్నారు. తహసీల్దార్ విశ్వనాథ్ జిల్లా ఆహారపౌరసరఫరాల డైరెక్టర్ షకీనా దీక్షను విరమించాలని ఎంతగానో వేడుకున్నా బీజేపీ నాయకులు, కార్యకర్తలు పట్టించుకోలేదు. సమస్య పరిష్కారమయ్యే వరకు నిరాహారదీక్ష మానుకోమని తెలిపారు. ఈ సందర్భంగా బీజేపీ తాలుకా అధ్యక్షుడు కుంటనహాళ్ మల్లికార్జున స్వామి, సీనియర్ నాయకులు ధరప్ప నాయక, ఎస్టీ మోర్చ తాలుకా అధ్యక్షులు బెళగల్ శివప్ప, ఇబ్రహీంపురం గంగప్ప, రైతు మోర్చ అధ్యక్షుడు శివ కుమార్ గౌడ, మైకేల్ వీరేష, బెళగల్ బసవరాజ, కార్యకర్తలు పాల్గొన్నారు

హంపి లో శ్రీలంక మాజీ అధ్యక్షుడు



హంపిలో శ్రీలంక మాజీ అధ్యక్షుడు రణిల్ విక్రమసింఘే

బళ్లారి, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ ప్రఖ్యాత పర్యాటక కేంద్రం అయిన హంపిని బుధవారం శ్రీలంక మాజీ అధ్యక్షుడు రణిల్ విక్రమసింఘే సందర్శించారు. విరుపాక్షేశ్వరున్ని దర్శించుకుని అనంతరం సప్తస్వరాలు, రాతి రథం ఆనేశాల, లోటస్ మహల్, చక్రతీర్థం తదితర ప్రాంతాలను ఆయన సందర్శంచారు. గైడు విశేషాలు, చరిత్ర, ప్రాముఖ్యతను వివరించారు.

హోసూరు జోన్

ఏనుగుల సంచారంపై అధికారుల హెచ్చరిక



సీసీటీవీలో రికార్డయిన ఏనుగుల సంచారం

హోసూరు, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): కొద్దిరోజులుగా సరిహద్దులోని కర్ణాటక రాష్ట్రంలోని అటవీ ప్రాంతం నుంచి 200కు పైగా ఏనుగులు బృందాలుగా కృష్ణగిరి జిల్లాలోని వివిధ అటవీప్రాంతాలకు చేరుకున్నాయి. అటవీప్రాంతాలకు అనుబంధంగా పంటలు కల్గిన రైతులు, పశువులు మేపేవారు అప్రమత్తంగా ఉండాలని అటవీశాఖ అధికారులు హెచ్చరించారు. ఏనుగుల కదలికపై పలు ప్రాంతాల్లో డ్రోన్, నిఘా కెమెరాలను ఏర్పాటు చేశామని అధికారులు తెలిపారు. మంగళవారం రాత్రి రాయకోట్టై వనచరగం ఉడూదుర్గం రిజర్వ్ ఫారెస్టుకు చెందిన 40 కి పైగా ఏనుగులు నాగమంగళం గ్రామం దాటి సానమావు అటవీ ప్రాంతానికి చేరుకున్నాయి. కావున సినిగిరిపల్లి, అనుమంతపురం, డి.కొత్తపల్లి, కొమ్మేపల్లి, శానమావు, బెన్నికల్, రైతులు, పశువుల కాపరులు అప్రమత్తంగా ఉండాలని అటవీశాఖ హెచ్చరించింది.

అంగన్‌వాడీ కేంద్రాలను పరిశీలించిన కలెక్టర్



భోజనాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ కేఎం సరయు

హోసూరు(కృష్ణగిరి), నవంబరు 27(ఆంధ్రజ్యోతి): కృష్ణగిరి జిల్లా హోసూరు పంచాయతీ యూనియన్, చెన్నసంద్రం పంచాయతీ శాఖ తరఫున రూ.68లక్షలతో చేపట్టిన పలు అభివృద్ధి ప్రాజెక్టు పనులను కలెక్టర్ సరయు స్వయంగా పరిశీలించారు. హోసూరు పంచాయతీ యూనియన్‌లోని చెన్నసంద్రం పంచాయతీ యూనియన్ మిడిల్ స్కూల్‌లో మధ్యాహ్న భోజన కార్యక్రమం క్రింద విద్యార్థులకు అందజేస్తున్న ఆహారం, గుడ్ల నాణ్యతను పరిశీలించారు. విద్యార్థుల అభ్యసన సామర్థ్యాన్ని స్వయంగా ఆరా తీశారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రంల్లో చిన్నారులకు అందిస్తున్న ఆహారం, పిల్లల బరువు, ఎత్తు, ఆహారం, పిల్లల హాజరు రికార్డులను స్వయంగా పరిశీలించారు. అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశుభ్రంగా నిర్వహించాలని సూచించారు. అనంతరం బాలల పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పన పథకం క్రింద రూ.31.65 లక్షలతో నిర్మించిన 2 తరగతి గదులను, పంచాయతీ యూనియన్ జనరల్ ఫండ్ నుంచి రూ.2 లక్షలతో 4 తరగతి గదుల మరమ్మతు పనులను పరిశీలించారు. నాబార్డు పథకం క్రింద చెన్నసంద్రం క్రింద రూ.18 లక్షల 42 వేలతో నీటి తొట్టెలు, వంట శాల, 15వ ఆర్థిక సంఘం మంజూరు పథకం క్రింద చెన్నసంద్రం పంచాయతీలో 30వేల లీటర్ల ఓవర్‌హెడ్ వాటర్ ట్యాంకు, బైరసంద్రం నుంచి మారసంద్రం ఓవర్‌హెడ్ వాటర్ ట్యాంక్, కిలోమీటర్ల మేర పైప్‌లైన్ పనులు చేపట్టారు. గ్రాంట్ పథకం క్రింద రూ.7.67 లక్షలతో నిర్మిస్తున్న కాంక్రిట్ రోడ్డు, చెన్నసంద్రం, కాలస్తీపురంలో రూ.3.50 లక్షలతో చిన్నపాటి ప్రజారోగ్య సముదాయం నిర్మాణ పనులను అడిగి తెలుసుకున్నారు. పనులను త్వరగా, నాణ్యతతో పూర్తి చేయాలని అధికారులకు సూచించారు.

మూడు నెలల చిన్నారికి పేగు శస్త్రచికిత్స



మీడియాతో వైద్య బృందం

హోసూరు, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): హోసూరు సెయింట్ పీటర్స్ మెడికల్ కళాశాల ఆసుపత్రి వైద్యులు మూడు నెలల శిశువుకు పేగు శస్త్రచికిత్సను విజయవంతంగా నిర్వహించారు. బెంగళూరులోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిల్లో ఆగస్టు 14న హోసూరుల్లో నివసిస్తున్న దంపతులకు 33 వారాల వయస్సున్న ఆడశిశువు నెలల నిండకుండానే జన్మించింది. పుట్టినప్పుడు శిశువు బరువు 1 కిలో మాత్రమే ఉండేది. కొద్దిరోజులుగా నొప్పితో బాధపడుతుండడంతో పరీక్షలు చేయించగా శిశువు చిన్న ప్రేగులలో ఇన్ఫెక్షన్ కారణమని గుర్తించారు. దీంతో వైద్యులు శస్త్రచికిత్స చేసి ఇన్‌ఫెక్షన్‌కు గురైన పేగును తొలగించారు. ఆసుపత్రిలో అంతర్జాతీయస్థాయి నాణ్యతా వైద్య సదుపాయాలు ఉండడంతోనే శస్త్ర చికిత్సను విజయవంతం చేయగలిగినట్టు హాస్పిటల్ డైరెక్టర్ రాజాముత్తయ్య, మెడికల్ సూపరెండెంట్ డాక్టర్ గిరీష్ ఒంగల్‌లు తెలిపారు.

33వ వార్డులో కమిషనర్ తనిఖీలు

హోసూరు, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): హోసూరు సిటీ కార్పొరేషన్ పరిధిలోని 33వ వార్డులో బుధవారం తెల్లవారుజామున కార్పొరేషన్ కమీషనర్ శ్రీకాంత్ ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. శాంతినగర్ వెస్ట్ సహ ప్రాంతాల్లో ఆకస్మికంగా తనిఖీ చేశారు. తనిఖీల్లో సమస్యలను స్వయంగా పరిశీలించిన కార్పొరేషన్ కమిషనర్ చర్యలు తీసుకుని పరిష్కరించాలని సంబంధిత కార్పొరేషన్ ఉద్యోగులను ఆదేశించారు. కౌన్సిల్ సమావేశంలో వార్డు సభ్యుల డిమాండ్ల మేరకు స్థితిగతులను పరిశీలిస్తున్నట్టు తెలిపారు. తనిఖీల సందర్భంగా కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు ప్రవీణ్ కుమార్, శాంతినగర్ వెస్ట్ రెసిడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఎగ్జిక్యూటీవ్‌లు పన్నీర్‌సెల్వం, సుబ్రహ్మణి, జగన్నాథ్, దేవరాజన్, ఇళంగో తదిరులు పాల్గొన్నారు. ఈనెల 21వ తేదిన మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో 33వ వార్డు సభ్యురాలు ఇంద్రాణి మునిరాజ్ తన వార్డుల్లో తాగునీరు, డ్రైనేజీ, రేషన్ షాపులు కొరత, చెత్త నిర్వహణ, తీవ్ర ట్రాఫిక్ సమస్యతో పాటు పలు సమస్యలను ప్రస్తావించిన విషయం విదితమే. ప్రాధాన్యత పరంగా సమస్యలను పరిష్కరిస్తామని కమిషనర్ హామీ ఇచ్చారు.



స్థానికుల సమస్యలను తెలుసుకుంటున్న కమిషనర్ శ్రీకాంత్ తదితరులు


పాఠశాలలో స్టేషనరీ పంపిణీ

హోసూరు, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): తమిళనాడు ఉపముఖ్యమంత్రి ఉదయనిధి స్టాలిన్ పుట్టినరోజును పురస్కరించుకుని కృష్ణగిరి పశ్చిమ జిల్లా ఆది ద్రావిడ సంక్షేమ కమిటీ ఆధ్వర్యంలో హోసూరు సమీపంలోని మత్తిగిరి ప్రభుత్వ పంచాయతీ యూనియన్ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు స్టేషనరీ, మిఠాయిలు పంపిణీ చేశారు. బుధవారం అభిమానులు పలు చోట్ల సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహించారు. 250మందికిపైగా విద్యార్థులకు నోటు పుస్తకాలు, రాత సామగ్రి అందచేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత స్థానానికి ఎదగాలన్నారు. తల్లిదండ్రులను గౌరవిస్తూ సంస్కృతీ సంప్రదాయాలను కాపాడాల్సిన బాధ్యత విద్యార్థులపై ఉందన్నారు. కార్యక్రమానికి కృష్ణగిరి పశ్చిమ జిల్లా ఆది ద్రావిడ సంక్షేమ సంఘం నిర్వాహకులు మునిరాజు అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ ఆనందయ్య, డివిజన్ కార్యదర్శి తిమ్మరాజు, నగర ఉప కార్యదర్శులు గోపాల్కృష్ణ, రవి కుమార్, కౌన్సిల్ సభ్యురాలు మంజుళ మునిరాజు, ప్రధానోపాధ్యాయురాలు రాజప్రియ పాల్గొన్నారు.

నేటి ప్రముఖులు

పోర్ట్రైట్ ఆర్టిస్ట్ కే.శే. శంకరనారాయణ కౌండ్...

ఎంఎం కలబుర్గి (జయంతి)



హంపిలోని కన్నడ విశ్వ విద్యాలయానికి వైస్ చాన్స్‌లర్‌గా వ్యవహరించిన ప్రముఖ కన్నడ విద్వాంసుడు మల్లేశప్ప మడివాళప్ప (ఎంఎం) కలబుర్గి 1938 నవంబరు 28న విజయపుర జిల్లా సిందగి తాలూకా గుబ్బేవాడ గ్రామంలో జన్మించారు. రచయిత, చరిత్రకారుడు, శాసనకారుడు, 'కన్నడ'లో వచన సాహిత్యంలో పండితుడు. పీహెచ్‌డీ చేశారు. 103 పుస్తకాలు, 400కుపైగా వ్యాసాలు రాశారు. కర్ణాటక ప్రభుత్వంచే ముద్రితమయ్యే 'సమగ్ర వచన సంపుట' కు ప్రధాన సంపాదకులుగా వ్యవహరించారు. కన్నడ సాహిత్య అకాడమీ, నాడోజ, నృపతుంగ, పంప, బసవ, రాజ్యోత్సవ పురస్కారం ఇతర అవార్డులు పొందారు. 2015 ఆగస్టు 30న హత్యకు గురయ్యారు.

టోమీ ఉంజెరెర్ (జయంతి)



ఫ్రాన్స్ దేశ రచయిత, నటుడు జీన్ థామస్ టోమీ ఉంజెరెర్ 1931 నవంబరు 28న స్ట్రాస్‌బర్గ్‌లో జన్మించారు. రచయిత, నటుడు. పిల్లలకు సంబంధించిన అంశాలపై ఇల్లుస్ట్రేటర్‌గా రాణించారు. 140కుపైగా రచనలు చేశారు. అంతర్జాతీయస్థాయిలో పేరొందిన 'హన్స్ క్రిస్టియన్ అండర్సన్ మెడల్'ను పొందారు. జీవిత సాఫల్య పురస్కారం, ఇతర అవార్డులు అందుకున్నారు. ఫ్రాన్స్ దేశంచే 'లెజియన్ ఆఫ్ హానర్' పొందారు. 2019 ఫిబ్రవరి 9న కన్నుమూశారు.

ఎనిడ్ మేరి బ్లైటన్ (వర్ధంతి)



ఎనిడ్ మేరి బ్లైటన్ 1897 ఆగస్టు 11న లండన్‌లో జన్మించారు. పిల్లలకు సంబంధించిన అంశాలు, విద్య, ఫాంటసీ, మిస్టరీలపై ఆమె ఎన్నో రచనలు చేశారు. ప్రపంచ వ్యాప్తంగా 90కుపైగా భాషలలో తర్జుమా కావడం ద్వారా ఎంతగా ప్రభావితం చేశారో అర్థం చేసుకోవచ్చు. 1930 నుంచి 600 మిలియన్ కాపీలకుపైగా అమ్ముడయ్యాయి. 'నోడీ, ఫేమస్ ఫైవ్, మలోరి టవర్స్, సీక్రెట్ సెవెన్' సిరీస్ ఎంతో పేరొందాయి. 1968 నవంబరు 28న కన్నుమూశారు.

వృద్ధుల హక్కులను రక్షించాలి

న్యాయాధికారి డీకే మంజునాథాచారి

బాగేపల్లి, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): నేటి బాలలే రేపటి పౌరులని పేర్కొంటూ చిన్నారులతోపాటు వృద్ధుల హక్కుల రక్షణలో మానవత్వం చాటాలని జేఎంఎఫ్‌సి న్యాయాధికారి డీకే మంజునాథాచారి అభిప్రాయపడ్డారు. పట్టణంలోని శాంతినికేతన్ పాఠశాలలో తాలూకా న్యాయసేవా సమితి, స్త్రీ శిశుసంక్షేమ శాఖ, న్యాయవాదుల సంఘం, ఆరోగ్యశాఖ, విద్యాశాఖ సంయుక్త ఆధ్వర్యంలో బాలల దినోత్సవం, చట్టాలపై అవగాహన కార్యక్రమాన్ని ప్రారంభించి ప్రసంగించారు. మహిళలపై దౌర్జన్యాల నియంత్రణకు సంబంధించి చట్టాలను తెలుసుకోవాలని, సమాజంలో తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, వృద్ధులను గౌరవించాలన్నారు. చక్కటి మార్కులు సాధించిన విద్యార్థులను మరింతగా ప్రోత్సహించాలన్నారు. కేవలం పాఠాలకే పరిమితం కాకుండా సామాజిక అంశాలపై అవగాహన కల్పించడంతో చట్టాల గురించి తెలుసుకోవాలన్నారు. ఇటీవలికాలంలో కొంతమంది మొబైల్‌కు వ్యసనం అవుతున్నారని అవగాహన కల్పించి మంచి అలవాట్లకు మళ్లించాలన్నారు. సీనియర్ న్యాయవాది ఏజీ సుధాకర్ మాట్లాడుతూ జిల్లాపైకి తాలూకాలో బాల్యవివాహాలు ఎక్కువ జరిగాయని, ఇకనైనా ప్రజలలో మార్పు రావాలన్నారు. యువత చట్టాలపై అవగాహన పెంచుకుని సన్మార్గంలో సాగాలన్నారు. కార్యక్రమంలో పబ్లిక్ ప్రాసిక్యూటర్



జాగృతిలో న్యాయాధికారి డీకే మంజునాథాచారి తదితరులు

చిన్నస్వామి, తాలూకా ఆరోగ్యాధికారి డాక్టర్ సీఎస్ సత్యనారాయణరెడ్డి, తాలూకా క్షేత్ర సమన్వయాధికారి ఆర్ వెంకటరావప్ప, పాఠశాల పాలకమండలి సభ్యుడు రఘునాథ్, ప్రధానోపాధ్యాయుడు నవీన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు



వివిధ వేషధారణలతో విద్యార్థుల బృందం, ఉపాధ్యాయులు

బంగారపేట, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): తాలూకాలోని బూదికోటె జ్యోతి ఇంటర్నేషనల్‌స్కూల్ బాలల దినోత్సవంలో భాగంగా సాంస్కృతిక కార్యక్రమాలు అలరించారు. విద్యార్థులు వివిధ వేషధారణలతో ఆకట్టుకున్నారు. సంక్రాంతి, ఉగాది, శ్రీరామనవమి, దసరా, దీపావళి తదితర పండుగలతో రంజాన్, బక్రీద్, క్రిస్మస్ వంటి పండుగల వేళ ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించడం ద్వారా చిన్నారులలో చైతన్యం కల్పిస్తున్నట్టు సంస్థ ప్రిన్సిపాల్ సతీశ్‌కుమార్ తెలిపారు. గ్రామపంచాయతీ అధ్యక్షుడు మంజునాథ్, విద్యాసంస్థ కార్యదర్శి సుమలతా, ట్రస్టు సభ్యురాలు కళావతి, ప్రధానోపాధ్యాయురాలు శశికళ, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌బీఐ 90 క్విజ్‌లో జాతీయస్థాయి ఫైనల్‌కు పీఈఎస్ విద్యార్థులు

బెంగళూరు, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): ఆర్‌బీఐ 90 క్విజ్ పోటీలలో పీఈఎస్ యూనివర్సిటీ ఎలక్ట్రానిక్‌సిటీ క్యాంపస్ విద్యార్థులు జాతీయ స్థాయిలో ఫైనల్స్‌కు ఎంపికయ్యారు. ఏఐఎంఎల్ ద్వితీయ సెమిస్టర్ విద్యార్థులు భార్గవ రామశర్మ, సీఎస్ విద్యార్థిని దివ్యాంశుశర్మలు కొచ్చిలో జరిగిన రీజనల్ పోటీలలో రెండోస్థానంలో నిలిచారు.



కొచ్చిలో జరిగిన పోటీల్లో సత్తాచాటిన విద్యార్థులు

రిజర్వు బ్యాంకు ఏర్పాటు చేసిన పోటీలలో ఫైనల్స్‌కు ఎంపికైన జట్టుకు రూ.4లక్షల నగదుతోపాటు డిసెంబరు 6న ముంబైలో జరిగే ఫైనల్స్‌కు అర్హత సాధించారు. ఈమేరకు పీఈఎస్ యూనివర్సిటీ చాన్స్‌లర్ ప్రొఫెసర్ ఎంఆర్ దొరస్వామి విద్యార్థులను అభినందించారు. జాతీయస్థాయి పోటీల్లోనూ రాణించాలని సూచించారు.

యువతలో నైతిక విలువలు పెంపొందించాలి



జాగృతిలో న్యాయాధికారి మొహ్మద్ రోషన్‌షా తదితరులు

శిడ్లఘట్ట, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): విద్య కేవలం ఉద్యోగం పొందడానికి మాత్రమే కాదని ఉత్తమప్రజలుగా రూపుదిద్దుందుకు దోహదపడుతుందని నేటి యువతలో నైతిక విలువలు పెంపొందించడం ద్వారాను చక్కటి సమాజం సాధ్యమని సీనియర్ సివిల్ న్యాయాధికారి మొహమ్మద్ రోషన్‌షా అభి ప్రాయపడ్డారు. పట్టణంలోని ప్రభుత్వ ఫస్ట్‌గ్రేడ్ కళాశాలలో తాలూకా న్యాయసేవల సేవా సమితి, ప్రభుత్వ పీయూ కళాశాల, సాంఘిక సంక్షేమశాఖ సంయుక్త ఆధ్వర్యంలో ఏర్పాటైన చట్టాలపై జాగృతిలో పాల్గొన్నారు. ఇదే సందర్భంగా న్యాయదినోత్సవాన్ని ఆచరించారు. రాజ్యాంగం ద్వారా మన హక్కులతోపాటు కర్తవ్యాలకు ప్రాధాన్యత ఇచ్చారన్నారు. రాజ్యాంగ పీఠికను ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ప్రధాన సివిల్ న్యాయాధికారి జె పూజా, న్యాయవాదుల సంఘం తాలూకా అధ్యక్షుడు ఏ నారాయణస్వామి, ఫస్ట్‌గ్రేడ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జి మురళి ఆనంద్, డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ వెంకటశివారెడ్డి, ప్రొఫెసర్ డాక్టర్ షఫి అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

మేలూరులో కన్నడ రాజ్యోత్సవం

శిడ్లఘట్ట, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): మేలూరు గ్రామ పంచాయతీలో డాక్టర్ రాజ్‌కుమార్ అభిమానుల సంఘం, కన్నడ రైతు యువ జనుల సంఘం ఆధ్వర్యంలో 69వ కన్నడ రాజ్యోత్సవాన్ని ఘనంగా ఆచరించారు. ఎమ్మెల్యే



పద్మశ్రీ గ్రహీత జోగతి మంజమ్మ తదితరులు

రవికుమార్ కార్యక్రమాన్ని ప్రారంభించగా పద్మశ్రీ గ్రహీత జోగతి మంజమ్మ ముఖ్యులుగా పాల్గొని మాట్లాడుతూ కన్నడ సంస్కృతిని పెంపొందించే కార్యక్రమాలు నిరంతరం కొనసాగాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో గ్రామపంచాయతీ అధ్యక్షురాలు శశికళ రమేశ్, ప్రముఖ డైరెక్టర్ నాగేంద్రప్రసాద్, డాక్టర్ రమేశ్, గజేంద్ర శ్రీనివాస్, కన్నడ సంఘాల అభిమానులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీలకు ఆత్మీయ వీడ్కోలు

బెంగళూరు, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): ఇటీవలే ఎమ్మెల్సీ పదవీ కాలం ముగిసిన సభ్యులకు ఘనంగా వీడ్కోలు పలికారు. విధానపరిషత్ సభాపతి బసవరాజ హొరట్టి ఆధ్వర్యంలో బుధవారం ప్రత్యేక కార్యక్రమం జరిగింది. సభ్యులు యూబీ వెంకటేశ్, ప్రకాశ్ రాథోడ్‌లకు వీడ్కోలు పలికారు. కార్యక్రమంలో పరిషత్ విప్ సలీం అహ్మద్,



ఎమ్మెల్సీ వెంకటేశ్‌కు సన్మానం

పరిషత్ కార్యదర్శి మహాలక్ష్మితోపాటు పలువురు పాల్గొన్నారు.

యువతి హత్యకేసులో
నిందితుడి కోసం గాలింపు

బెంగళూరు, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): అస్సోంకు చెందిన మాయాగొగోయ్ (22)ను ఆమె మిత్రుడు, కేరళ వాసి ఆరవ్ హానోయ్ దారుణంగా హత్య చేసిన కేసులో గాలింపుల కోసం రెండు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. కొన్నేళ్లకాలంగా మాయాగొగోయ్ బెంగళూరులో నివసిస్తున్నారు. హెచ్ఎస్ఆర్ లే అవుట్‌లో ఓ కంపెనీలో ఇటీవలే కొత్తగా ఉద్యోగంలో చేరారు. మాయాగొగోయ్ సోషల్ మీడియాలోనూ యాక్టివ్‌గా ఉండేవరని తెలుస్తోంది. ఇద్దరూ కలసి కొంతకాలంగా లివింగ్ రిలేషన్‌షిప్‌లో ఉండేవారని అదే చనువుతోనే ఇద్దరూ ఇందిరానగర్‌లోని ఒక హోటల్‌కు ఇటీవల వెళ్లారు. మంగళవారం అతను ఒక్కడే బయటకు వెళ్లడంతో నిర్వాహకులు అనుమానంతో పోలీసులకు సమాచారం ఇచ్చారు. వారు ఉన్న గదిని పరిశీలించగా మాయాగొగోయ్‌ను కిరాతకంగా హతమార్చినట్టు పోలీసులు గుర్తించారు. చాకుతో ఛాతీతోపాటు చేయి నరాలను వివిధ శరీరభాగాలలో తీవ్రంగా పొడవడంతోనే మృతి చెందినట్టు పోలీసులు నిర్ధారణకు వచ్చారు. ఆరవ్ అపార్ట్‌మెంట్‌నుంచి బయటకు వచ్చి ఓ క్యాబ్‌లో మెజస్టిక్ రైల్వేస్టేషన్‌దాకా వెళ్లిన ఆనవాళ్లను సీసీ



మాయా గొగోయ్ (ఫైల్), నిందితుడు ఆరవ్ హనోయ్

కెమెరాల ద్వారా పసిగట్టారు. ఆ తర్వాత అతడి మొబైల్ స్విచ్ఛాఫ్ కావడంతో గాలింపులు జరుపుతున్నట్టు ఇందిరానగర్ పోలీసులు తెలిపారు.

కలబురగి సెంట్రల్ జైలులో మూకుమ్మడిగా ఖైదీల నిరసన



నిరసన తెలుపుతున్న ఖైదీలు

బెంగళూరు, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని జైళ్లు తరచూ వివాదాలకు కేంద్ర మవుతున్నాయి. తాజాగా మంగళవారం కలబురగి సెంట్రల్‌జైలులో ఖైదీలు మూకుమ్మడిగా నిరసనకు దిగారు. జైలు సూపరిం టెండెంట్ వేధిస్తున్నారని ఆరోపిస్తూ నిరసనకు దిగిన వీడియోలు, ఫోటోలు బుధవారం వైరల్ అయ్యాయి. జైలులో వ్యవస్థ పట్ల ఖైదీలు మండిపడ్డారు. ఉదయం టిఫిన్ తీసుకోకుండా ఆందోళన చేపట్టారు. జైలు అధికారుల తీరుపట్ల మండిపడ్డారు. సెంట్రల్ జైలుకు ఏడీజీపీ లేదా జిల్లా అధికారి, న్యాయమూర్తి వస్తే మా సమస్యలు చెబుతామన్నారు. జైలు సూపరింటెండెంట్ డాక్టర్ అనితా, శ్రీకాంత్ రంజేరిలను వెంటనే బదిలీ చేయాలని డిమాండ్ చేశారు. ఇదే డిమాండ్‌తో జిల్లా న్యాయమూర్తికి పలువురు ఖైదీలు రాసిన లేఖను ప్రదర్శించారు. జైలులో నాసిరకం ఆహారం అందిస్తున్నారని, ఇక్కడి అధికారులు శారీరకంగా మానసికంగా హింసిస్తున్నారని ఆక్రోశం వ్యక్తం చేశారు. ప్రతి సమస్యకు సూపరింటెండెంట్ పీఏ శ్రీకాంత్ డబ్బులు డిమాండ్ చేస్తున్నారని ఆరోపించారు. అడిగినంత డబ్బులు ముట్టచెప్పకపోతే ఇతర జైళ్లకు బదిలీ చేస్తామని, లైంగిక ఆరోపణల కింద ఎఫ్ఐఆర్ నమోదు చేస్తాని బెదరిస్తున్నట్టు వాపోయారు. సదరు వీడియోలు హల్‌చల్ చేశాయి.

ప్లాస్టిక్ కవర్లను నియంత్రించండి

ఓబుళదేవరచెరువు, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): మండలంలోని హోటల్ నిర్వాహకులు ప్లాస్టిక్ కవర్లను అతిగా వినియోగిస్తున్నారని, వాటిని నియంత్రించేలా చర్యలు తీసుకోవాలని బీజేపీ నాయకులు.. ఈఓఆర్డీ కేశవరెడ్డికి బుధవారం వినతి పత్రం అందజేశారు. ఆయన వెంట జిల్లా కార్యవర్గ సభ్యుడు ఆర్ఎంపీ హరిక్రిష్ణ, మండలాధ్యక్షుడు రంగారెడ్డి, జిల్లా యువజన సెకటరీ సురేష్‌బాబు, నాయకులు ఉన్నారు.

పనిదినాలు పెంచకపోతే చర్యలు

ఓబుళదేవరచెరువు: ఉపాధి కూలీలకు పనిదినాలు పెంచకపోతే చర్యలు తప్పవని ఏపీడీ జ్యోతి హెచ్చరించారు. బుధవారం ఎంపీడీఓ కార్యాలయంలో ఉపాధి సిబ్బందితో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. మినీగోకులాల మంజూరైన వెంటనే పనులు ప్రారంభించాలన్నారు. హర్టికల్చర్ మంజూరైన రైతుల పొలాల్లో గుంతలు తీయడం.. మొక్కలు నాటడం పనులు పూర్తి చేయాలన్నారు. సమావేశంలో ఏపీడీ సహాయకులు ప్రతాప్‌రెడ్డి, ఈసీ ఆంజనేయులు, సాంకేతిక, క్షేత్రసహాయకులు పాల్గొన్నారు.

హెచ్‌ఎంను నియమించండి

తనకల్లు, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు హెచ్‌ఎంను నియమించాలని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు కోరుతున్నారు. పాఠశాల హెచ్ఎంగా పనిచేస్తున్న మహమ్మద్‌ఖాదర్ వలీ ఇన్‌చార్జి ఎంఈఓగా పుట్టపర్తికి వెళ్లారు. తనకల్లుకు రెగ్యులర్ హెచ్‌ఎం అయినా.. ఆయన పుట్టపర్తిలోనే ఉంటున్నారు. స్థానికంగా హెచ్‌ఎం లేకపోవడంతో విద్యార్థులు, ఉపాధ్యాయులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వెంటనే హెచ్‌ఎంను నియమించాలని కోరుతున్నారు.

బాల్యవివాహాలతో అనర్థాలపై ర్యాలీ

ఓబుళదేవరచెరువు, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : బాల్య వివాహాల తో సంభవించే అనర్థాలపై బాలికలు ఐసీడీఎస్ ఆధ్వర్యంలో బుధవా రం రాత్రి కొవ్వొత్తులతో అవగాహన ర్యాలీ నిర్వహించారు. మండలంలోని అల్లాపల్లిలో అంగన్‌వాడీ కార్యకర్త స్వర్ణలత, గౌనిపల్లిలో షమీమ్ ఆధ్వర్యంలోనూ ర్యాలీ నిర్వహించారు.

జనసేనలో చేరిక

ధర్మవరం, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పలు వార్డులకు చెందిన 20 కుటుంబాల సభ్యులు జనసేన పార్టీలో చేరారు. బుధవారం ఆ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిలకం మధుసూదన్‌రెడ్డి సమక్షంలో ఆ పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. పార్టీలో చేరిన వారిలో జుట్బూరు వెంకటేశ్, రవికుమార్, నరసింహ, జి.వెంకటేశ్, ఆదిశేషు, అశోక్, రాజేంద్ర ఉన్నారు.

బైక్‌పై దూసుకెళ్లిన బస్సు
దంపతుల మృతి



దంపతులు (ఫైల్)

చింతామణి, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని అత్యంత రద్దీగా ఉండే రోడ్డులోని ఆదర్శ థియేటర్ వద్ద బైక్ అదుపు తప్పగా వెనుకనుంచి వచ్చిన కేఎస్ ఆర్టీసీ బస్సు దూసుకెళ్లిన ఘటనలో దంపతులు మృతి చెందిన సంఘటన బుధవారం చోటు చేసుకుంది. తాలూకాలోని బురుడుగుంట సమీపంలోని కొమ్మసంద్రకు చెందిన వెంకటేశ్ (40), భార్య సరస్వతమ్మ (34) మృతి చెందినవారుగా గుర్తించారు. వివరాలిలా. సరస్వతమ్మ సొంతూరు కైవార హోబళి చిన్నసంద్ర పంచాయతీ పరిధిలోని నారాయణహళ్ళి గ్రామం. బంధువు సురేశ్, ఇంకా స్నేహితులు శబరిమలైకు వెళ్తున్న నేపథ్యంలో గ్రామంలో ఇరుముడి పూజా కార్యక్రమంలో పాల్గొనేందుకు ద్విచక్రవాహనంపై వెళ్తుండగా ఒక్కసారిగా అదుపు తప్పి కిందపడ్డారు. అదే సమయంలో శిడ్లఘట్టకు చెందిన కేఎస్ఆర్టీసీ బస్సు వెనుకనుంచి వచ్చి దూసుకెళ్లడంతో దంపతులు అక్కడికక్కడే మృతి చెందారు. సమాచారం అందుకున్న పట్టణ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. డీఎస్పీ మురళీధర్, టౌన్ సీఐ విజికుమార్, ఎస్సై ముళ్యారప్ప, రూరల్ ఎస్సై మమతాలు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

జీవనశైలి మార్పులే
పొత్తికడుపు క్యాన్సర్‌కు కారణం

బెంగళూరు, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): పొత్తికడుపు క్యాన్సర్ ప్రబలేందుకు జీవనశైలిలో మార్పులే కారణమవుతోందని సంప్రద ఆసుపత్రి సీనియర్ కన్సల్టెంట్ రాధేశ్యామ్ నాయక్ అభిప్రాయపడ్డారు. పాంక్రియాటిక్ క్యాన్సర్‌పై బుధవారం వర్చువల్ రూపంలో సదస్సు జరిగింది. ఈ సందర్భంగా పలువురు వైద్య నిపుణుల అభిప్రాయం ప్రకారం ప్రతి లక్షమందిలో 10-15మందికి పొత్తికడుపు క్యాన్సర్ బాధితులు ఉన్నారన్నారు. మనదేశంలో 2.5 - 3.5 శాతంగా నిర్ధారణ అయ్యిందన్నారు. ప్రతి ఏటా 35-40వేలమంది బాధితులు పెరుగుతున్నారన్నారు. పాంక్రియాటిక్ క్యాన్సర్ ప్రబలేందుకు ప్రధాన కారణం స్థూలకాయం, తరచూ కడుపునొప్పి, కామెర్లు, మానసిక రుగ్మతతోపాటు పలు కారణాలు ఉంటాయన్నారు. వ్యాధి నిర్ధారణ చేసుకుంటే ఆధునాతన వైద్య విధానంలో చికిత్సలు పొందవచ్చునన్నారు.

బాలికకు చికిత్స విజయవంతం

బెంగళూరు, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): విచిత్రమైన సమస్యతో బాధపడుతున్న బాలికకు చికిత్సను అందించడంలో విజయం సాధించారు. చిన్నారికి తరచూ జ్వరం, తలనొప్పి వచ్చేది. వైద్యులు ఈ సమస్యను రికెట్సియల్ మెనింగో ఎన్సెఫాలిటిస్ సమస్యగా నిర్ధారించారు. కళ్లకు చెందిన రెండు ఆప్టిక్ డిస్క్‌లలో వాపును గుర్తించి ఇదొక నరాల సమస్యలో భాగంగా ఉంది. సి టిఆర్ఐ చికిత్సతోపాటు యాంటిబయాటిక్‌లు ఇచ్చామని బెంగళూరు వాసవి ఆసుపత్రి పెడియాట్రిషన్ నిపుణురాలు డాక్టర్ వర్షిణి తెలిపారు. ప్రస్తుతం బాలిక కోలుకుని ఆరోగ్యంగా ఉందని నగరంలో విడుదల చేసిన ప్రకటనలో తెలిపారు.

క్లినిక్‌కు తాళం

శిడ్లఘట్ట, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని చిక్కబళ్ళాపుర రోడ్డు హండిగనాళ గ్రామంలోని బాలాజి కల్యాణమండపం సమీపాన పారంపర్య వైద్యుడిగా చికిత్సలు నిర్వహిస్తున్నారు. తాలూకా ఆరోగ్యాధికారుల తనిఖీల వేళ కొంగనహళ్ళి గున్నప్ప మనవడు రాజణ్ణగా నామఫలకంలో పేర్కొన్నట్టు గుర్తించారు. చింతామణి తాలూకా గున్నహళ్ళి వాసి అయిన ఇతను ప్రతిరోజూ గ్రామం నుంచి హండిగనాళకు వచ్చి క్లినిక్ నిర్వహించే వాడిగా గుర్తించారు. అర్హత లేకున్నా వైద్యం అందించడం సరికాదని హెచ్చరించి క్లినిక్‌కు సీల్ వేశారు.

కర్ణాటకలో విద్యార్థి ఆత్మహత్య



తేజ (ఫైల్)

డీ.హీరేహాళ్, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): కర్ణాటకలోని విజయనగరం జిల్లా కారిగనూరు రైల్వేస్టేషన్ సమీపంలో రైలు కిందపడి డీ.హీరేహాళ్‌కి చెందిన విద్యార్థి తేజ(17) ఆత్మహత్య చేసుకున్నాడు. మండల కేంద్రానికి చెందిన రవి, భాగ్యమ్మ దంపతులు కూలిపని చేసుకుని జీవనం సాగిస్తూ ఉండేవారు. వీరికి ఇద్దరు కుమారులు. తేజ బళ్లారి వీరశైవ కాలేజీలో ఇంటర్ సెకెండియర్ చదువుతుండేవాడు. హుబ్లిలో పని ఉందని రెండు రోజుల కిందట ఇంటి నుంచి బయల్దేరి వెళ్లాడు. అయితే మంగళవారం రాత్రి కర్ణాటకలోని కరిగనూరు రైల్వేస్టేషన్ సమీపంలో రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడు తేజ వద్ద లభించిన ఆధారాలతో రైల్వేపోలీసులు కుటుంబసభ్యులకు సమాచారం అందించారు. దీనిపై కర్ణాటక పోలీసులు కేసు నమోదు చేసుకుని, శవాన్ని విమ్స్ ఆసుపత్రికి తరలించి పోస్టుమార్టం అనంతరం కుటుంబసభ్యులకు అప్పగించారు.

ఉద్యోగం చేయలేక బలవన్మరణం

లేపాక్షి, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): సోమందేపల్లి సమీపంలోని ఓ పరిశ్రమలో పనిచేస్తున్న సాయిప్రసాద్(24) తన ఇంట్లో ఫ్యాన్‌కు బుధవారం ఉరివేసుకున్నాడు. లేపాక్షికి చెందిన సాయిప్రసాద్ కార్ల తయారీ అనుబంధ సంస్థలో ఉద్యోగి. పని ఒత్తిడి ఎక్కువగా ఉందని, మానేస్తానని తల్లిదండ్రులకు చెప్పేవాడు. మధ్యతరగతి జీవితం అని, సర్దుకుపోవాలని వారు సూచించారు. దీంతో దిక్కుతోచక ఉరి వేసుకున్నాడు. సాయి ప్రసాద్‌కు ఎనిమిది నెలల క్రితమే వివాహమైంది. ఇంతలోనే భర్త దూరం కావడంతో ఆమె కన్నీరుమున్నీరయ్యారు. మృతదేహాన్ని హిందూపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

వెదురుకు ప్రభుత్వ ప్రోత్సాహం

● తొలిసారిగా రాయితీ వర్తింపు ● ఐదు ఎకరాల దాకా రూ.50 వేలు



గుమ్మఘట్ట మండలం గొళ్లపల్లిలో వెదురు పంటను పరిశీలిస్తున్న ఉద్యాన అధికారులు

అనంతపురం అర్బన్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో వెదురు సాగును ప్రోత్సహించేందుకు ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. వెదురు సాగుకు రాయితీని వర్తింపజేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. పొలాల్లో వెదురును పూర్తి పంటగా సాగు చేసుకోవచ్చు. గట్ల వెంబడి నాటుకుంటే ప్రధాన పంటతోపాటు అదనపు ఆదాయాన్ని పొందవచ్చు. ఒక్కో రైతుకు ఐదు ఎకరాల దాకా వెదురు సాగుకు రాయితీని కల్పించారు. గరిష్ఠంగా రూ.50వేలు దాకా రాయితీని వర్తింపజేస్తారు. మొదటి సంవత్సరం రూ.25వేలు, రెండో సంవత్సరం రూ.15వేలు, మూడో సంవత్సరం రూ.10వేలు చొప్పున బతికి ఉన్న మొక్కల సంఖ్య ఆధారంగా అందజేయాలని నిర్ణయించారు. రెండో సంవత్సరం రాయితీ అందించాలంటే 80 శాతం మొక్కలు బతికి ఉండాలి. మూడో సంవత్సరం రాయితీ ఇవ్వాలంటే 100 శాతం మొక్కలు బతికి ఉండాలన్న షరతు విధించారు. గుంతలు తవ్వడానికి, మొక్కలు ఖరీదు, ఎరువులు, నీటి పాదరులకు కలిసి ఐదు ఎకరాలకు రూ.50వేలు రాయితీ వర్తింపజేస్తారు. పొలం మొత్తం వెదురు నాటుకోవాలంటే ఒక మొక్కకు మరో మొక్కకు వరుసకు, వరుసకు మధ్య 5 మీటర్ల దూరాన్ని పాటించాలి. ఇలా ఎకరాకు 160 మొక్కలు దాకా నాటుకోవచ్చు. గట్ల వెంబడి నాటుకోవాలంటే ఒక మొక్కకు మరో మొక్కకు 2 మీటర్ల దూరం ఉంటే సరిపోతుంది. జిల్లాలో ఎంత విస్తీర్ణానికైనా వెదురు సాగుకు సబ్సిడీ వర్తింపజేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. జిల్లాలోని గుమ్మఘట్ట మండల గొల్లపల్లిలో 7.5 ఎకరాల్లో పూర్తిగా వెదురు సాగవుతోంది. అలాగే గుంతకల్లు మండలం నక్కనదొడ్డిలో 7.5 ఎకరాల తోట చుట్టూ వెదురు సాగు చేస్తున్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా వెదురు సాగు కోసం ప్రభుత్వం సబ్సిడీని వర్తింపజేయడంపై రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఉపయోగాలు....

వెదురుతో పలు రకాల పనిముట్లు తయారు చేస్తారు. ముఖ్యంగా ఫర్నిచర్, జ్యువెలరీ అగర్బత్తి, తడికలు, నిచ్చెనలు, తయారు చేస్తారు. గృహ నిర్మాణం, కాగితం, దుస్తులు, ఔషధాలు, కళాత్మక వస్తువులు ఇలా అనేకం తయారు చేస్తారు. బ్యాంబూ షూట్స్‌ను ఆహారంగా తీసుకుంటారు.

న్యూస్‌బాక్స్

ఎంఎస్‌ఎంఈ సర్వేకు సహకరించండి

● పరిశ్రమల శాఖ జీఎం శ్రీధర్

అనంతపురం అర్బన్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వ ర్యాంప్ పథకంలో భాగంగా శుక్రవారం నుంచి నిర్వహించే ఎంఎస్‌ఎంఈ సర్వేకు సహకరించాలని పరిశ్రమల శాఖ జీఎం శ్రీధర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పరిశ్రమల శాఖ ఏపీ ఎంఎస్‌ఎంఈ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ సహకారంతో క్షేత్ర స్థాయిలో సర్వే చేస్తారన్నారు. ఈ సర్వే కోసం ఎంఎస్‌ఎంఈ సర్వే అండ్ సపోర్ట్ అనే మొబైల్ యాప్‌ను రూపొందించినట్లు తెలిపారు. ఈనెల 29 నుంచి వచ్చే ఏడాది జనవరి నెలాఖరు దాకా గ్రామీణ ప్రాంతాల్లో ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, పట్టణ ప్రాంతాల్లో వార్డు అమెనిటీ సెక్రటరీలు ఈ సర్వే చేస్తారన్నారు. ఈ సర్వే ద్వారా తయారీ, సేవ, వాణిజ్య రంగాల్లో అన్ని ఎంఎస్‌ఎంల ఈ సర్వే చేసి వాటిని డిజిటల్ ప్లాట్ ఫాంలోకి తీసుకొచ్చి, ఏపీ ఎంఎస్‌ఎం ఈ వన్ పోర్టల్‌కు అనుసంధానం చేస్తారని వెల్లడించా రు. ఇందులో నమోదు కాని వ్యాపారాలను ఉద్యం, ఉద్యమ అసిస్ట్‌లో నమోదు చేయడం ఎంఎస్‌ఎం ఈ ఫార్మలైజేషన్ ముఖ్యుడ్దేశ్యమన్నారు. దీన్ని దృష్టిలో ఉంచుకొని ఎంఎస్‌ఎం ఈ అసోసియేషన్లు, ఇతర పరిశ్రమల అసోసియేషన్లు, వర్తక, వాణిజ్య సంఘాలు సహకరించాలని కోరారు.

అదానీతో విద్యుత్ ఒప్పందాలను రద్దు చేయాలి

● సీపీఎం రాంభూపాల్

అనంతపురం కల్చరల్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం అదానీ కంపెనీతో చేసుకున్న విద్యుత్ ఒప్పందాలన్నింటినీ తక్షణమే రద్దు చేయాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు రాంభూపాల్ బుధవారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. గత వైసీపీ ప్రభుత్వం చేసుకున్న విద్యుత్ ఒప్పందాలను రద్దు చేయకుండా కూటమి ప్రభుత్వం మీనమేషాలు లెక్కించడం సబబు కాదని విమర్శించారు. గత ప్రభుత్వ అవినీతిపై రంకెలు వేస్తూ ఇపుడు అదానీకి తలవంచడమేంటని ప్రశ్నించారు. అమెరికా న్యాయస్థానంలో కేసు నమోదైన నేపథ్యంలో ప్రభుత్వం వెంటనే వాటిని రద్దు చేయాల్సిన అవసరముందన్నారు.

ఎస్జీటీ అభ్యర్థుల కోసం... డిసెంబరు 29న వదాన్య ప్రతిభ పరీక్ష

అనంతపురం ప్రెస్‌క్లబ్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): డీఎస్సీకి సిద్ధమవుతున్న ఎస్జీటీ అభ్యర్థులకు వదాన్య సొసైటీ ఆధ్వర్యంలో ప్రతిభ పరీక్ష నిర్వహిస్తున్నట్లు ఆ సొసైటీ ఫౌండర్ అశోక్ పడపాటి బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. సొసైటీ ఆధ్వర్యంలో 14 ఏళ్లుగా నిరుపేద నిరుద్యోగ ప్రతిభావంతులైన అభ్యర్థుల అభ్యున్నతే లక్ష్యంగా వదాన్య సొసైటీ వివిధ రకాల కార్యక్రమాలు నిర్వహిస్తోందన్నారు. అందులో భాగంగా ప్రతి సంవత్సరం జిల్లా పరిషత్ పాఠశాలలోని 9,10 తరగతుల విద్యార్థులకు టాలెంట్ టెస్టు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈక్రమంలోనే ఈ ఏడాది ఉమ్మడి జిల్లాలోని ఎస్జీటీ అభ్యర్థులకు డిసెంబరు 29న కొత్తచెరువు ప్రధాన కేంద్రంగా ప్రతిభా పరీక్ష నిర్వహిస్తున్నామన్నారు. ఇప్పటికే ఈ పరీక్ష కోసం ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 1500 మందిపైగా అభ్యర్థులు దరఖాస్తులు చేసుకున్నారన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు ఈ నెల 30లోగా www.vada anya. org లో నమోదు చేసుకోవాలన్నారు. ఈ పరీక్షలో ప్రతిభ కనబరిచిన అభ్యర్థులకు నగదు బహుమతి అందజేస్తామన్నారు.

తిరుపతి ప్యాసింజరు పాక్షిక రద్దు

గుంతకల్లు, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): రాయదుర్గం-కదిరిదేవరపల్లి రైల్వే స్టేషన్లలో యార్డు ఆధునికీకరణ పనుల కారణంగా తిరుపతి-కదిరిదేవరపల్లి-తిరుపతి ప్యాసింజరు రైలును పాక్షికంగా రద్దు చేసినట్లు రైల్వే అధికారులు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. తిరుపతి-కదిరిదేవరపల్లి ప్యాసింజరు (నం. 07589) రైలును డిసెంబరు 1నుంచి 31 వరకూ గుంతకల్లు-కదిరిదేవరపల్లి సెక్షన్‌లో రద్దుపరచినట్లు తెలియజేశారు. ఆ తేదీల్లో గుంతకల్లు-తిరుపతి సెక్షన్‌లో మాత్రమే ఈ రైలు నడవనుంది. అలాగే దీని తిరుగు ప్రయాణపు రైలు (నం. 07590) డిసెంబరు 2 నుంచి జనవరి 1వ తేదీ వరకూ గుంతకల్లు-కదిరిదేవరపల్లి సెక్షన్‌లో రద్దుపరచి గుంతకల్లు-తిరుపతి సెక్షన్‌లో నడపనున్నట్లు వివరించారు.

ప్రశాంతంగా సివిల్స్ స్క్రీనింగ్ పరీక్ష

అనంతపురం ప్రెస్‌క్లబ్, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): సివిల్స్ ఉచిత శిక్షణకు సంబంధించి బుధవారం నిర్వహించిన స్క్రీనింగ్ పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. బీసీ స్టడీ సర్కిల్‌లో నిర్వహించిన పరీక్షకు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 55 మంది అభ్యర్థులు హాజరయ్యారు. ఈ పరీక్షకు మొత్తం 57 మంది దరఖాస్తు చేసుకున్న ట్లు అధికారులు తెలిపారు. అనంతపురం జిల్లాకు సంబంధించి 37, శ్రీసత్యసాయి జిల్లాకు సంబంధించి 18 మంది అభ్యర్థు లు పరీక్షలకు హాజరయ్యారు. పరీక్షల ను అనంత జిల్లా అభ్యర్థులకు ఒక గది లో... శ్రీసత్యసాయి జిల్లా అభ్యర్థులకు మరో గదిలో పరీక్షలు నిర్వహించారు. ఈ పరీక్షలను బీసీ సంక్షేమశాఖ డీడీ కుష్బూకొఠారీ పరిశీలించారు. ఉత్తీర్ణత సాధించిన వారికి విజయవాడలోని బీసీ భవన్‌లో ఉచితంగా శిక్షణ ఇస్తారని ఆమె తెలిపారు. పరీక్షను శ్రీసత్యసాయి జిల్లా నూ పరింటెండెంట్ హరిత, ఏబీసీడబ్ల్యూఓ రంగమ్మ, వార్డెన్లు మారుతీ ప్రసాద్, రవీంద్రనాథ్ ఠాగూర్, మాధవి, స్టడీ సర్కిల్ కో-ఆర్డినేటర్ రవీంద్ర, లైబ్రేరియన్ శ్రీనివాసులు, సుబ్బయ్య, ప్రకాష్ తదితరులు పరిశీలించారు.

ఉండలేరు... పోలేరు..!

అసౌకర్యాల మధ్య ఆడపిల్లల చదువులు



ఆరుబయటే భోజనం తింటున్న విద్యార్థులు

- ఇరుకు గదుల్లో 20మంది విద్యార్థులు
- మొండి గోడల మధ్యనే భోజనాలు
- ఆగిపోయిన హాస్టల్ భవన నిర్మాణ పనులు
- పేదింటి బిడ్డలకు వసతి కష్టాలు
- దీనావస్థలో కేఎస్ఎన్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల వసతి గృహం

అనంతపురం సెంట్రల్, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): వసతి గృహంలో సౌకర్యాలు లేక కేఎస్ఎన్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఒక్కో గదిలో 15 నుంచి 20 మంది వసతి పొందాల్సిన దుస్థితి నెలకొంది. భవన నిర్మాణం పూర్తికాకపోవడంతో మొండి గోడల మధ్యనే భోజనాలు చేయాల్సిన పరిస్థితి ఉంది. వ్యక్తిగత అవసరాలు తీర్చుకునేందుకు నానా తంటాలు పడాల్సి వస్తోంది. పలు ఇబ్బందులతో స్నానాలు చేయకుండానే తరగతికి వెళ్లాల్సి వస్తోందని విద్యార్థినులు వాపోతున్నారు.

ఐదేళ్లుగా మొండి గోడల మధ్యే...

విద్యార్థుల శ్రేయస్సు, భద్రతను దృష్టిలో పెట్టుకుని కళాశాల ఆవరణలోనే హాస్టల్‌ను ఏర్పాటు చేశారు. ప్రారంభంలో పది గదులతో కూడిన భవనాన్ని నిర్మించి హాస్టల్‌ను ప్రారంభించారు. విద్యార్థుల సంఖ్య పెరగడంతో గదులు సరిపోవడంలేదు. దీంతో అప్పటి టీడీపీ ప్రభుత్వంలో యూజీసీ, రూసా తదితర నిధులను సమీకరించి కొత్తభవనాల నిర్మాణాలు చేపట్టారు. సెమినార్ హాల్, అదనపు తరగతి గదుల భవనం పూర్తిచేసి వినియోగంలోకి తీసుకువచ్చారు. అయితే హాస్టల్ కోసం నిర్మిస్తున్న భవనాలు పిల్లర్లు, గోడలు, స్లాబుల వరకు మాత్రమే పూర్తయ్యాయి. మిగిలిన పనులు పూర్తిచేసి వినియోగంలోకి తేవాల్సి ఉండగా ఎన్నికలు రావడం, వైసీపీ అధికారాన్ని చేపట్టడంతో హాస్టల్ భవనాల నిర్మాణాలు ఆగిపోయాయి. ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో ఐదేళ్లుగా మొండి గోడలమధ్యనే విద్యార్థులు వసతి పొందుతూ, భోజనం చేస్తున్నారు.

ప్రైవేట్ హాస్టళ్లకు విద్యార్థులు...

కళాశాల హాస్టల్లో సరిపడా గదులు లేకపోవడంతో చాలా మంది విద్యార్థులు ప్రైవేట్ హాస్టళ్లకు వెళ్తున్నారు. అడ్మిషన్ సమయంలో ఏదో రకంగా హాస్టల్ ఫీజులు చెల్లించి చేరిపోయారు. అయితే ఇక్కడి పరిస్థితులు భరించలేక, కట్టిన ఫీజులు వెనక్కితీసుకుని ప్రైవేట్ హాస్టళకు వెళ్తున్నారు. అయితే ప్రైవేట్ హాస్టళ్లలో భద్రతకు భరోసా లేదని విద్యార్థుల తల్లిదండ్రులు వాపోతున్నారు. గత్యంతరం లేక బయటికి హాస్టల్లో చేర్పించాల్సి వస్తోందని పేర్కొంటున్నారు. ప్రభుత్వం స్పందించి తగిన భవనాలు నిర్మించాలని వేడుకుంటున్నారు.

ఒక్కో గదిలో 20 మంది..

కొత్త భవన నిర్మాణ పనులు పూర్తిచేసి వినియోగంలోకి తీసుకు రాకపోవడంతో పాతభవనంలోనే విద్యార్థులు కాలం వెళ్లదీస్తున్నాం. ఒక్కో గదిలో 20 మంది వరకు వసతి పొందుతున్నారు. వ్యక్తిగత అవసరాలు తీర్చుకోవాలన్నా, స్నానాలు చేయాలన్నా గంటల కొద్దీ వేచిచూడాల్సి వస్తోందని పలువురు విద్యార్థులు వాపోతున్నారు. దీంతో వారంలో ఒకటి, రెండు సార్లు మాత్రమే స్నానాలు చేస్తున్నామని, ఒక్కోసారి మొహం కడుక్కోవడానికి సమయం సరిపోక ఆలస్యంగా తరగతికి వెళ్తున్నామని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఒక్క భవనంలోనే 600 మంది వరకు వసతి పొందలేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని పేర్కొన్నారు. ప్రభుత్వం, అధికారులు స్పందించి తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతున్నారు.

1600 మంది విద్యార్థినులు

ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో కేఎస్ఎన్ మహిళా డిగ్రీ కళాశాలకు మంచి పేరుంది. ఇక్కడ డిగ్రీలో 15 రకాల కోర్సులు అందిస్తున్నారు. బాలికల ప్రత్యేక కళాశాలల కావడంతో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పలు ప్రాంతాల విద్యార్థినులు ఇక్కడ చదువుకునేందుకు ఆసక్తి చూపుతున్నారు. ఈ నేపథ్యంలో ప్రతి ఏటా దాదాపు 600మంది అడ్మిషన్ అవుతున్నారు. మూడు సంవత్సరాలు డిగ్రీ కోర్సుల్లో కలిపి 1600 మంది విద్యార్థినులు ఉన్నట్లు అధికార వర్గాలు తెలిపాయి. వీరిలో అత్యధికంగా గ్రామీణ ప్రాంతాలకు చెందినవారే. మరోవైపు సరిపడా తరగతి గదుల్లేక షిఫ్టులవారిగా పాఠాలు బోధిస్తున్నట్లు అధ్యాపకులు చెబుతున్నారు.

కాళ్లరిగేలా తిరిగినా..

తమ కళాశాలలో అడ్మిషన్స్ పెరిగాయని, సరిపడా భవనాలు లేక విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారని, కళాశాల అధికారులు గత ప్రభుత్వానికి అనేక సార్లు మొరపెట్టుకున్నారు. అసంపూర్తిగా ఉన్న హాస్టల్ భవన నిర్మాణం పూర్తిచేయడానికి, అదనపు తరగతి భవనం నిర్మించేందుకు నిధులు ఇవ్వాలని ఐదేళ్ల కాళ్లరిగేలా జిల్లా అధికారుల చుట్టూ తిరిగారు. అయినా కళాశాల వైపు ఏ అధికారి చూడలేదు. దీంతో ఆర్డీటీ వంటి స్వచ్ఛంద సంస్థలు, సేవాగుణం కలిగిన వారిని ఆశ్రయించారు. అయితే అప్పటి పాలకులు వారిని సైతం ఆ కళాశాలవైపు రాకుండా నియంత్రించారని విద్యార్థులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు



గోడలుకట్టి వదిలేసిన గదులు



అసంపూర్తిగా నిలిచిపోయిన నిర్మాణాలు. పిల్లర్లు, స్లాబులతో వదిలేసిన భవనాలు



గదుల పరిస్థితి ఇదీ..!



తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం: హాస్టల్ విద్యార్థి

హాస్టల్లో తగిన గదుల్లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. కళాశాల హాస్టల్ అయితే బాగుంటుందని, సెక్యూరిటీ ఉంటుందని చాలా మంది ఇక్కడికే వస్తున్నాం. ఒకే గదిలో 20మంది వరకు ఉంటున్నాం. అదనపు భవనాలున్నా వాటిని పూర్తిగా నిర్మించలేదు. కొన్ని గదులకు గోడలు నిర్మించారు. మరికొన్నింటిని అలానే వదిలేశారు. బట్టలు ఆరవేయడానికి, చదువుకోవడానికి వాటినే ఉపయోగిస్తున్నారు. వర్షం వస్తే మెస్‌హాల్లో భోజనం చేయడానికి లేదు. ప్రైవేట్ హాస్టల్లో సెక్యూరిటీ ఇబ్బంది ఉంటుందని ఇక్కడే ఉండిపోతున్నాం.

దాతల కోసం ఎదురుచూస్తున్నాం : సత్యలత, ప్రిన్సిపాల్, కేఎస్ఎన్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల

విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని కళాశాలలోనే హాస్టల్‌ను ఏర్పాటు చేశాం. అయితే సరిపడా భవనాలు, గదులు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఒక్కో గదిలోనే 20మంది వరకు ఉంటున్నారు. వ్యక్తిగత అవసరాలు కూడా తీర్చుకోలేకపోతున్నారు. అదనంగా నిర్మాణం తలపెట్టిన భవనం పూర్తికాలేదు. పిల్లర్లు, స్లాబుల వరకే పనులు అయ్యాయి. కొన్ని గదులకు గోడలు కట్టివదిలేశారు. మిగిలిన పనులు పూర్తిచేయడం కోసం ఆర్డీటీ, ఇతర దాతలను సాయం అడిగాం. కళాశాల పూర్వ విద్యార్థుల నిధుల నుంచి దాదాపు రూ.4లక్షల విలువగల పనులు చేయిస్తున్నాం. దాతలు ముందుకువచ్చి సాయం చేస్తే విద్యార్థుల భవిష్యత్తుకు చేయూతనిచ్చిన వారవుతారు.



ఏంటో ఈ విడ్డూరం..!

మూతపడిన ఆయిల్‌ఫెడ్ సంస్థకు కొనుగోలు బాధ్యతలు



మూతపడిన ఆయిల్ ఫెడ్ జిల్లా కార్యాలయం

- మద్దతు ధరలేక నష్టపోతున్న వేరుశనగ రైతులు
- సమాచారం తెలిపినా స్పందించని రాష్ట్ర అధికారులు

అనంతపురం అర్బన్/ శింగనమల, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యవసాయ శాఖ ఉన్నతాధికారుల అనాలోచిత నిర్ణయాలతో జిల్లా వేరుశనగ రైతులు నష్టపోతున్నారు. పండించిన వేరుశనగ పంటను మద్దతు ధరతో కొనేవారు కరువయ్యారని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రతి ఏటా మద్దతు ధరతో రైతుల నుంచి వేరుశనగ కొనుగోలు బాధ్యతను ఏపీ మార్క్‌ఫెడ్ సంస్థకు ఉన్నతాధికారులు అప్పగించేవారు. అయితే ఈ ఏడాది ఆయిల్‌ఫెడ్ సంస్థకు అప్పగించడం రైతులకు ఆశనిపాతమైంది. ఎందుకంటే ఈ సంస్థ జిల్లా కార్యకలాపాలు మానేసి మూడేళ్లు దాటింది. అయినా రాష్ట్ర ఉన్నతాధికారులు అనాలోచితంగా మూతపడిన సంస్థకు కొనుగోలు బాధ్యతలు అప్పగించడంపై విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. ఆయిల్‌ఫెడ్ సంస్థ జిల్లాలో మూతపడిన విషయం రాష్ట్ర ఉన్నతాధికారులకు తెలిపినా ఇప్పటి దాకా స్పందించలేదన్న వాదనలు వినిపిస్తున్నాయి. దీంతో జిల్లా రైతులు నష్టపోవాల్సి వస్తోంది. తప్పని పరిస్థితుల్లో బయట మార్కెట్‌లో తక్కువ ధరకు వేరుశనగ పంటను అమ్ముకోవాల్సిన దుస్థితిని రైతులు ఎదుర్కొంటున్నారు.

అరకొర దిగుబడికి మద్దతు ధర ఏదీ?

ఈ ఏడాది ఖరీఫ్‌లో జిల్లా వ్యాప్తంగా 7.9 లక్షల ఎకరాల్లో పంటలు సాగు చేశారు. ఇందులో 1.11 లక్షల ఎకరాల్లో వేరుశనగ పంట సాగైంది. ఈ ఏడాది ఖరీఫ్‌లో వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో జూలై మాసంలో ఆలస్యంగా వేరుశనగ పంట సాగు చేశారు. వేరుశనగ పంట కీలక సమయాలు పూత, ఊడలు దిగే సమయాల్లో వర్షం పడలేదు. దీంతో వేరుశనగ దిగుబడి భారీగా తగ్గింది. ఎకరాకు ఒక క్వింటా నుంచి 2 క్వింటాళ్ల దిగుబడి మాత్రమే వచ్చింది. అక్టోబరు నెలాఖరులోగా 70 శాతం పంట కోత పూర్తయ్యింది. ఈనెల రెండో వారంలోగా మిగతా పంట కోతలు పూర్తి చేశారు. ఈ సారి అరకొరగా పండిన వేరుశనగ పంటను కూడా మద్దతు ధరతో ప్రభుత్వం కొనుగోలు చేయలేకపోతోంది. ప్రతి ఏడాది ఏపీ మార్క్‌ఫెడ్‌కు వేరుశనగ పంట ఉత్పత్తి కొనుగోలు బాధ్యతలు అప్పగిస్తూ వస్తున్నారు. ఈ సారి ఆయిల్‌ఫెడ్ సంస్థకు అప్పగించారు. గత వైసీపీ సర్కాల్ సమయంలోనే జిల్లాలో ఆయిల్ ఫెడ్ కార్యాలయాన్ని బంద్ చేశారు. ఇక్కడ పనిచేస్తున్న ఆ సంస్థ అధికారులు, సిబ్బంది ఉద్యోగ విరమణ చెందారు. అప్పటి నుంచి జిల్లాకు ఎవరినీ నియమించలేదు. ఆయిల్ ఫెడ్ కార్యాలయాన్ని సైతం ప్రైవేటు సంస్థకు లీజుకు ఇచ్చేశారు. జిల్లాలో ఆయిల్ ఫెడ్ కార్యకలాపాలు లేకపోయినా వ్యవసాయ శాఖ రాష్ట్ర ఉన్నతాధికారులు అనాలోచితంగా అదె సంస్థకు వేరుశనగ కొనుగోలు బాధ్యతలు అప్పగించడం విమర్శలకు తావిస్తోంది. ప్రతి ఏడాది వేరుశనగ కోతలు పూర్తి కాగానే రైతు సేవా కేంద్రాల్లో రిజిస్ట్రేషన్ ఆరంభిస్తూ వస్తున్నారు. గతేడాది ఏపీ మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో సెప్టెంబరు మాసంలో రిజిస్ట్రేషన్ ప్రక్రియ మొదలు పెట్టారు. అక్టోబరు నెలలో రైతుల నుంచి వేరుశనగను మద్దతు ధరతో కొనుగోలు చేశారు. ఈ సారి ఆయిల్‌ఫెడ్ సంస్థకు వేరుశనగ బాధ్యతలు అప్పగించడంతో పాటు ఏపీ మార్క్‌ఫెడ్ సంస్థ అధికారులు ఏమిచేయలేని పరిస్థితిలో ఉండిపోయారు. వేరుశనగ పంటను మద్దతు ధరతో కొనుగోలు చేయాలని ఉమ్మడి జిల్లాలోని పలువురు రైతులు ఏపీ మార్క్‌ఫెడ్ సంస్థ అధికారులను సంప్రదించినట్లు సమాచారం. ఈ విషయాన్ని వారు రాష్ట్ర ఉన్నతాధికారులకు తెలియజేసినట్లు సమాచారం. అయినప్పటికీ ఇప్పటి దాకా ఆయిల్‌ఫెడ్‌కు బదులుగా తిరిగి ఏపీ మార్క్‌ఫెడ్‌కు వేరుశనగ కొనుగోలు బాధ్యతలు అప్పగించలేదు.

మద్దతు ధర పెంచినా ప్రయోజనం శూన్యం

గతంతో పోలిస్తే ఈ సారి వేరుశనగ మద్దతు ధరను పెంచారు. ఈ ఏడాది వేరుశనగ క్వింటా కనీస మద్దతు ధర రూ.6783లుగా ప్రభుత్వం నిర్ణయించింది. గతేడాది వేరుశనగ మద్దత ధర రూ.6377 ఉంది. గతంతో పోలిస్తే ఈ సారి మద్దతు ధరను పెంచారు. అయినప్పటికీ జిల్లాలో మూడపడిన ఆయిల్‌ఫెడ్ సంస్థకు వేరుశనగ కొనుగోలు బాధ్యతలు అప్పగించడంతో రైతులకు ఎలాంటి ప్రయోజనం లేకుండా పోయింది. ప్రభుత్వం స్పందించి ఎప్పటిలాగానే ఏపీ మార్క్‌ఫెడ్ సంస్థకు వేరుశనగ కొనుగోలు బాధ్యతలు అప్పగించి, మద్దతు ధరను కల్పించాల్సి ఉంది.



తక్కువ రేటుకే అమ్ముకున్నా

ఈ సారి 9 ఎకరాల్లో వేరుశనగ పంట సాగు చేశా. దిగుబడి తక్కువగా వచ్చింది. వారం రోజుల కిందట బస్తా (42 కిలోలు)వేరుశనగ రూ.2300తోను అమ్మేశా. ప్రభుత్వం మద్దతు ధరతో కొనుగోలు చేసి ఉంటే మాకు ఈ పరిస్థితి వచ్చేది కాదు. అరకొరగా పండిన పంటకు గిట్టుబాటు ధర లేకపోవడంతో మరింత నష్టపోయాం.

- పరశురాం, సోదనపల్లి, శింగనమల మండలం



ఎదురుచూశా..

ఆరు ఎకరాల్లో వేరుశనగ సాగు చేశా. 12 క్వింటాళ్లు మాత్రమే దిగుబడి వచ్చింది. వేరుశనగ కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తారని ఎదురుచూశా. కనీసం వేరుశనగను కొనుగోలు చేస్తామని అధికారులు ప్రకటన కూడా ఇవ్వలేదు. దీంతో వారం రోజుల కిందట తక్కువ ధరకే వేరుశనగ అమ్మేశా.

- శ్రీనివాసులు, చిన్నమట్ల గొంది, శింగనమల మండలం

మూతబడిన సంస్థకా బాధ్యతలు..?

జిల్లాలో మూతబడిన ఆయిల్ ఫెడ్ సంస్థకు వేరుశనగ కొనుగోలు బాధ్యతలు ఎలా అప్పగిస్తారు..? రాష్ట్ర ఉన్నతాధికారులకు ఆ మాత్రం కనీస సమాచారం తెలియకపోతే ఎలా. ఉన్నతాధికారులు తీసుకున్న నిర్ణయాలతో జిల్లాలో కనీస మద్దతు ధరకు రైతులు దూరమయ్యారు. జిల్లాలో కొన్నేళ్లుగా ఆయిల్ ఫెడ్ సంస్థ కార్యకలాపాలు చేయడం లేదని తెలిసిన తర్వాత కూడా ఉన్నతాధికారులు స్పందించకపోవడం దారుణం. ప్రభుత్వం ఈ విషయంలో తక్షణ చర్యలు తీసుకొని, మద్దతు ధరతో వేరుశనగ పంటను కొనుగోలు చేసేలా చర్యలు తీసుకోవాలి.

- చంద్రశేఖర్‌రెడ్డి, ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి

నేడు, రేపు కేంద్ర బృందం పర్యటన

డ్వామా పీడీ సలీం బాషా



మాట్లాడుతున్న డ్వామా పీడీ

అనంతపురం క్లాక్‌టవర్, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): కేంద్ర జలశక్తి అభియాన్ నోడల్ ఆఫీసర్లు జిల్లాలో రెండు రోజులు పర్యటించనున్నారు. కేంద్ర వాణిజ్యశాఖ డైరెక్టర్, కేంద్రజల శక్తి అభియాన్ నోడల్ ఆఫీసర్ అరులానందన్, శాస్త్రవేత్త షరీఫ్‌ఖాన్‌లు జిల్లాలో ఉపాధి, వాటర్‌షెడ్‌లలో చేపడుతున్న పనులను గురు, శుక్రవారం పరిశీలించనున్నారు. కేంద్ర బృందం పర్యటనకు సంబంధించిన ఏర్పాట్లపై తన చాంబర్‌లో డ్వామా పీడీ సలీంబాషా ఏపీడీలు, ఏపీఓలతో సమీక్షించారు. ఉపాధి హామీ, వాటర్‌షెడ్ పథకాల అమలు తీరు, చేపట్టిన పనులను కేంద్రబృందం పరిశీలిస్తుందని పీడీ తెలిపారు. వాన నీటి సంరక్షణ, భూగర్భజలాల పెంపు, మొక్కల పెంపకం, అటవీకరణ, వర్షం నీటి పునర్వినియోగం వంటి పనులను ప్రధానంగా పరిశీలిస్తారన్నారు. రెండు రోజుల పాటు జిల్లా వ్యాప్తంగా గుర్తించిన ప్రాంతాల్లో పర్యటిస్తారన్నారు. డ్వామా, అటవీశాఖ, హార్టికల్చర్, ఏపీఎంఐపీ, అగ్రికల్చర్, భూగర్భజల శాఖ, ఇరిగేషన్ శాఖల అధికారులు, ఇంజనీర్లు కేంద్రబృందానికి చేపట్టిన పనులను వివరిస్తారన్నారు. ఇప్పటి వరకు చేపట్టిన ఉపాధి, వాటర్‌షెడ్ పనులను, భవిష్యత్తులో జిల్లాలో చేపట్టే పనులపై చర్చిస్తారని తెలిపారు. సమావేశంలో వాటర్‌షెడ్ అడిషినల్ పీడీ సుధాకర్‌రెడ్డి, ఏపీడీలు విజయ్‌కుమార్, ఆయేషా, అనురాధా, శైలజ, ఏపీఓలు, ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఉడేగోళాన్ని ఆదర్శంగా తీసుకోండి

ప్రజలకు కేంద్ర బృందం సూచన

కణేకల్లు, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): మండలంలోని 43 ఉడేగోళం గ్రామాన్ని ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకొని అభివృద్ధి చెందాలని కేంద్ర బృందం సభ్యులు డాక్టర్ కురుసిరిస్తా, కేకే జాలి పేర్కొన్నారు. గ్రామంలో బుధవారం వారు పర్యటించారు. ఈ సందర్భంగా ప్రతి ఇంటికి ఏర్పాటు చేసిన తాగునీటి కొళాయి, మరుగుదొడ్లను పరిశీలించా రు. ఈ సందర్భంగా కేంద్ర బృందం సభ్యులు మాట్లాడుతూ జల్‌జీవన్ మిషన్‌లో భాగంగా 43 ఉడేగోళంలో ప్రతి ఇంటికి తాగునీటి కొళాయి ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. స్వచ్ఛభారత్ మిషన్‌లో భాగంగా ప్రతి ఇంటికి మరుగుదొడ్లు ఏర్పాటు చేయడాన్ని ప్రశంసిం చారు. ఈ సందర్భంగా గ్రామసర్పంచ్ లావణ్యను అభినందించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శ్రీనివాసులు, ఆర్‌డబ్ల్యుఎస్ డీఈ శ్రీనివాసు లు, జేఈ శివకృష్ణారెడ్డి, సర్పంచ్ లావణ్య, వైస్ సర్పంచ్ రామాంజ నేయులు, టీడీపీ నాయకులు మారుతి, అనిల్, శివశంకర్ పాల్గొన్నారు.



ఉడేగోళంలో పర్యటిస్తున్న కేంద్ర బృందం

రైతన్నకు యాప్ అండ

ఎన్‌పీఎస్ఎస్ యాప్ ద్వారా తెగుళ్ల వివరాలు, నివారణ చర్యలు

అనంతపురం అర్బన్, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): నేషనల్ పెస్ట్ సర్వేలెన్స్ సిస్టమ్ (ఎన్‌పీఎస్ఎస్) యాప్ ద్వారా పురుగు, తెగుళ్ల వివరాలు, వాటి నివారణ చర్యలు తెలుసుకోవచ్చునని జిల్లా వ్యవసాయ అధికారి ఉమామహేశ్వరమ్మ తెలిపారు. స్థానిక రైతు శిక్షణా కేంద్రంలో బుధవారం ఉమ్మడి జిల్లా వ్యవసాయ అధికారులు, రైతులకు ఎన్‌పీఎస్ఎస్, జాతీయ పురుగు నివారణ పద్ధతులపై అవగాహణ కార్యక్రమాన్ని నిర్వహించారు. యాప్‌ను ఉపయోగించి పొలంలో పంటను ఫొటో తీస్తే ఆ పంటకు సోకిన తెగుళ్లు, పాటించాల్సి నివారణ చర్యల వివరాలను అందజేస్తుందన్నారు. ఈ యాప్‌పై రైతులకు క్షేత్ర స్థాయిలో అవగాహన కల్పించాలన్నారు. యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకొని ఎలా వినియోగించాలన్న విషయాలపై సీఐపీఎంసీ విజయవాడ కార్యాలయ ఆఫీస్ ప్లాంట్ ప్రొటెక్షన్ అధికారి వీరయ్య చౌదరి క్షుణ్ణంగా వివరించారు. కార్యక్రమంలో డీడీఏ మద్దిలేటి, టెక్నికల్ ఏఓ వెంకట్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయ అధికారి ఉమామహేశ్వరమ్మ

పేపర్‌బ్యాలెట్ వ్యాజ్యం కొట్టివేత

- సుప్రీం తీర్పును వెల్లడించిన కలెక్టరు

అనంతపురం టౌన్, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): ఎన్నికలలో ఈవీఎంలను తొలగించి పేపర్ బ్యాలెట్ విధానాన్ని మళ్లీ ప్రవేశ పెట్టాలని కోరుతూ దాఖలైన ప్రజాహిత వ్యాజ్యాన్ని సుప్రీంకోర్టు మంగళవారం కొట్టివేసినట్లు కలెక్టరు డాక్టరు వినోద్‌కుమార్ తెలిపారు. ఇందుకు సంబంధించిన కోర్టు ఉత్తర్వుల సారాంశాన్ని కలెక్టరు బుధవారం ఓప్రకటనలో వెల్లడించారు. ఎన్నికలలో ఈవీఎంల ట్యాంపరింగ్‌పై కేఏపాల్ చేసిన వాదనలను న్యాయస్థానం కొట్టేసిందన్నారు. అదే సమయంలో ఎన్నికలలో ఓడిపోయినపుడు మాత్రమే ఈవీఎంల విశ్వసనీయతను ప్రశ్నించే నాయకుల అస్థిర వైఖరిని న్యాయస్థానం ఎత్తిచూపిందన్నారు. ఎన్నికలలో ఈవీఎంల వ్యవస్థతో రాజకీయపార్టీలకు ఎలాంటి సంబంధం లేదని జస్టిస్ విక్రమ్‌నాథ్, జస్టిస్ పీబీ.వరాలేలతో కూడిన ధర్మాసనం స్పష్టం చేసిందని కలెక్టరు తెలిపారు.